# నవారంభం

శ్రీ ఎ. బి. కృష్ణమాచారి

అనంతంగా కనిపించే యీకాలం అనాదిగూడానేమో ఎవరికి తెలుసు. ఏదో మనకు గుర్తుతెలిసిన దగ్గర్నుంచి గుర్తుండేందుకు, గుర్తుంచి అవసరమైన విధంగా హద్దులుగీచి, ముక్కలుచేసి ఆ ముక్కలమధ్యలో మన ఘనతచూసుకొని మురిసిపోతాం. అనంతమైన ఆ కాలవాహిని మనమూ, మనం నిర్ణయించిన గుర్తులు, హద్దులూ అన్నీ తుడిచి పెట్టుకపోవచ్చు

విశ్వాసాలకీ, వాటిని ఒరుసుకొని ఉండే సందేహాలకీ మధ్యగా సతమత మౌతుండే మనకు ఉగాదిరోజంతా ఎట్లాగడిస్తే, ఆ సంవత్సరమంతా అట్లాగే దొర్లిపోతోంది అనేదిగూడా విశ్వాసం. అందుచేతనే మిగతా కష్టాలన్నీ మరిచి పోయి, మరిపించేవిధంగా ఆరోజు గడపటానికి ప్రయత్నిస్తూ ఉంటాం

జీవితమంతా వెదజల్లిన వెన్నెలలాఉండి, అందులో విరబూసిన పువ్వు లాంటి ఆనందం బద్ధకంగా ఏరుకునేటు జీవితమంతా మధురంగానంగ గడచి పోయే అదృష్టవంతులకు ప్రతిరోజూ ఉగాదే ప్రతిరోజూ పండగే శలవు, కొత్త బట్టలు, విశేషఖాద్య వస్తువులు, వేపపువ్వు ప్రసాదం, యివన్నీ తెచ్చే ఉగాది అన్నా, లేకమరే పండగ అన్నా పిల్లలకు ఆనందమే ఆ పండుగ రోజూ ఉంటే బాగుండు ననుకుంటారుగూడా

దుర్భర పరిస్థితులమధ్య బ్రతికే మనకు ప్రత్యేకదినం పండగ ఏమిటి, ఖర్చుకోసంతప్ప అనుకునే, సమస్యలమధ్య పరిష్కార మార్గాలకు చేసే ప్రయ త్నాలమధ్యగా జీవితం యిచ్చే దౌర్భాగ్యులకు అసలు ఏ పండగఅన్నా కష్టంతప్ప అర్థంలేదు అనంతానికి ఆదిఏమిటి అందులో సంవత్సరాలేమిటి, సంవత్సరానికి మొదలేమిటి, అది పండగఏమిటి, అంటూ మధ్య మోసే వేదాంతులకు, తత్వ జ్ఞానులకూ దేనికీ సరియైన అర్థం కనిపించలేదు

పండగ అంటే భరించలేకపోయినా తప్పనిసరి అయ్యే ఖర్చుతోటి, ఇల్లాళ్ళ అలకతోటి, కూతుళ్ళ కోపంతోటీ, వాళ్ళకోపాలూ అలకలూ తీర్చటంచూసి నిరాశతో మిగతా పిల్లలు పెట్టే మూతివిరుపులతోటి సతమతమయ్యే కుటుంబీ కుడికి గూడా కనీసం పండగఅయిపోయిన తర్వాతనైనా ఏదోవిధంగా గట్టెక్కాంగదా అనే తృప్తి ఉంటుంది ఇంకొకజాతి మనుష్యులయితే గడించిన మధుర స్మృతులబాధో, విరహబాధో ఉండి వాటితో కలిసిన కమ్మదనం తృప్తినిస్తూ ఉంటుంది

కాకపోతే జీవితపు విలువలు తెలియనివాళ్ళకూ, అనుభవం అయితేగాని అర్థంగాని వాళ్ళకు, అర్థంచేసుకోవడానికి ప్రయత్నించని వాళ్ళకు, ప్రాతిపదిక లేని నమ్మకాలు గలవాళ్ళకు మామూలు అర్థం కనిపించదు వాళ్ల మనస్సులో ఉన్న విపరీతార్థ మేదో కనిపిస్తుంది కాని అన్నిచోట్లా స్వేచ్ఛగా తిరిగే ఆనందపుగాలులు మాత్రం అందరిచుట్టూలాగే వీళ్లచుట్టూగూడా తిరుగుతూనే ఉంటయ్. వీళ్ళ హృదయ కవాటాలుగాని, జ్ఞానవాలతాయనాలు గాని తెరిచిఉండకపోవటం మూలంగా చుట్టూ తిరిగి తగిలి, ఏదో తెలియని, అవ్యక్త వ్యథనిమాత్రం కలిగిస్తూ ఉంటయ్ మనుషులుగా పుట్టారుగనుక సహజమైన స్పందించే గుణం వీళ్ళలోకొంచెం అచేతనంగా ఉంటుంది

మోహనరావు యీ తరహాకి చెందినవ్యక్తి తనకు అన్నీ సరిగ్గానే తెలుసు అనుకునే వ్యక్తి సుఖంగానే ఉంటున్నా అనుకుంటూ, కొంచెం మార్పు కోసం అనుకుంటూ నాలుగురోజులు శలవుపెట్టి ఎటో తిరిగివస్తుంటాడు. అతనికి స్నేహితులు లేరు ఏ స్నేహితులతోనూ అతని స్నేహం ఎక్కువకాలం ఉంచుకోడు ఉండటానికి వీలులేనట్లు కనిపిస్తుంది అందుకని తెంపేస్తాడు. బంధువుల యిళ్ళకుగూడా వెళ్ళడు వాళ్ళువేసే అర్థంలేని ప్రశ్నలు గిట్టవు అందు చేత ఏదో వెతుక్కునేవాడు వెళ్ళినట్లు ఎక్కడికోవెళ్ళి తిరిగి వస్తుంటాడుతప్ప బంధువులదగ్గరకీ, స్నేహితులదగ్గరికీ వెళ్ళడు చోటుమారితే వచ్చే కొద్దిపాటి మార్పుతోటే సుఖపడుతూ ఉంటాడు తృప్తిపడ్డా ననుకుంటూ

ఈసారి మాత్రం అతను స్నేహితుణ్ణి చూడటానికే ప్రయాణంకూర్చాడు. యిటువైపుపండగ అనీకాదు,పండగకోసమనీకాదు తనస్నేహితుడికోసం, అతనిప్రాధే యపూర్వకమైనఆహ్వానం ఎప్పటినుంచోఉంది అదీపూర్తి కారణంకాదు అతని ప్రపం చమేమారింది పూర్వాశ్రమంలో అతను తనకు మంచిస్నేహితుడు పరాశ్రమంలో అతనికి సంతానం, దారిద్ర్యం, దౌర్భాగ్యం మాత్రమే స్నేహితులు పాత స్నేహి తులు బాల్యస్నేహితులు ఒకరికొకరి అడ్రసులుగూడా తెలియవు ఒకసారి తను డ్యూటీమీద వెళ్తుంటే, ప్లాటుఫారంమీద కనబడి, కనబడ్డ అయిదు నిము షాల్లో ఆరుయుగాల కథచెప్పి గట్టిగా రమ్మనిచెప్పి, తప్పకుండా వస్తాననిపించుకొని వెళ్ళిపోయాడు అదిజరిగీ సంవత్సరంఅయింది తనకి దూరంగా ఉద్యోగం చేస్తున్నాడు అతను ఉత్తరాలు వ్రాస్తూనే ఉన్నాడు కాని తను అన్ని వ్రాయ లేదు వ్రాసినదాంట్లో తనసంగతి ఏమీ వ్రాయలేదు ఏంవ్రాసినా అతనికి అర్థం కాదు పైగా తనదే తప్పుఅంటాడు జీవితంమీద పెద్ద లెక్చరు యిస్తాడు తన జీవితం తృప్తిగానే ఉన్నదంటాడు తప్పకుండా తనజీవితం అర్థంలేని బ్రతుకు అంటాడు అర్థంచేసుకోటానికి ప్రయత్నించెడివాడిది, చెబితే వినినివాడిదీ బ్రతుకు అట్లానే ఉంటుందంటాడు అదే తనకు గిట్టదు అసలు మొదటి నించీ రాజు అట్లానే అంటాడు అందుకే మిగతాస్నేహితుల్నిలాగానే అతన్ని గూడా వదిలేశాడు తనకు విశ్వాసమే అన్నీ తను సరిగ్గానే అర్థంచేసుకుని చేస్తాడు

ఏమీ తోచక ఆ మధ్య అతని ఉత్తరాలు చదివాడు తనకు జాలివేసింది అతని ప్రపంచమే రూపులేనంతగా మారింది అతనికి సుఖము శాంతి లేవు అయినా తృప్తిగానే ఉన్నదని సమర్థిస్తుంటాడు జీవితాన్ని అర్థంచేసుకోవటంలోనే ఉంది దానిగొప్పతనం అంటాడు ఆ ఉత్తరాలన్నీ యిప్పటిదాకా మళ్ళీ చదవలేదు యిప్పుడు చదివినతరువాత కొంచెం ఆలోచన వచ్చింది తనవిషయం ఆలో చించాడు తన ప్రపంచంగూడా మారింది తనకు సుఖంగానే ఉన్నట్లు అనిపిం చింది అతను కష్టపడుతున్నాడు ఉత్తరాలలో ఎంత సమర్థించి తృప్తిగా, సుఖంగా ఉన్నానని వ్రాసినా, దారిద్ర్యం, దౌర్భాగ్యంతోటి కష్టమే పడుతున్నాడు. అతను తననుజీవితం అర్థంచేసుకోమంటాడు తనసంగతి, యీ మధ్య సంగతి తెలియదు తను ఎంతసుఖంగా ఉంటున్నాడో తెలియదు తనలాగే ఆలోచిస్తే తను అర్థంచేసుకున్నట్లు అర్థంచేసుకుంటే అతనిజీవితంగూడా సుఖంగానే ఉంటుంది ఆ విషయమే అతనికి ఒకసారి చెప్తాడు బాధామయమైన ఆ ప్రపం చంలో ఉన్న అతని ఒకప్పటి స్నేహితుడిమీద కొంత జాలి అభిమానంగూడా కలిగాయి కష్టపడుతూగూడా సుఖంగానే ఉన్నానని వ్రాసే అతని మార్పేమిటో గూడా చూద్దామనుకున్నాడు దాన్నిబట్టిచూస్తే తనుపొందే సుఖం కష్ట మేమో

ఆ మార్పేమిటో చూద్దామని మరెటో పోదామనుకున్నవాడల్లా ఇటు తిరిగి పండగరోజు ఉదయం రైల్లో ఆ చిన్నస్టేషనులో దిగాడు. దిగినతర్వాత

గాని తెలియలేదు తన ఇబ్బందులసంగతి తనకి ఇబ్బందికలిగితే ముందు ఆ సంగతి ఆలోచిస్తాడు మానవుడు ప్రక్కవాడి ఇబ్బంది రెండవస్థానానికి వస్తుంది. మహా పురుషుల విషయంవేరు కాని వాళ్ళు అరుదు మోహనరావు మహాపురుషుడు కాదు

దిగినతర్వాత తెలిసింది అతనికి తను వెళ్ళవలసిన ఊరు ఐదుమైళ్ళు ఉన్నదని. అక్కడకిదగ్గరగా ఆ స్టేషనుకి పెట్టినపేరుగల ఊరుగూడా లేదు అదీ స్టేషనుకి ఓ రెండుమైళ్ళదూరానగానిలేదు ఆ గ్రామపు మొఖాసాదారు, తన పలుకుబడితో తనకోసం స్టేషను పెట్టించుకున్నాడట ఇంతదూరం అని తెలిస్తే తను వచ్చేవాడో కాదోమరి తీరా ఇప్పుడు వచ్చేశాడు. తను పట్టణ వాసానికి అలవాటుపడ్డ మనిషి వెంటనే తిరిగి వెళ్ళటానికి బండికోసం ప్రశ్నించాడు అదీ ఇప్పుడల్లాలేదు తను వెళ్ళవలసిన ఊరికి బండిగాని దొరుకుతుందా అని ప్రశ్నించాడు దానికి సమాధానంగా అతనిపెట్టె బెడ్డింగు ఇంతసేపటినించి మోస్తూనేఉన్న తాతఅన్నాడు "ఇవి వెయిటింగు రూములో పెట్టే రానా బాబూ"

అతనికి అర్థమైంది ఆ తాత బరువుతో ఇందాకటినుంచీ నిలుచునిఉన్నాడు అని అతను యీ మధ్యే అట్లాంటి మాటలు అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

అతను "ఊ" అనటంతో తాత సామాను తీసుకొని వెళ్ళాడు అతనికి సంతోషమైంది అక్కడ వెయిటింగురూము ఉన్నందుకు. అతను నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రకృతివేపు, తనకు కొంతవిషయమైన చెప్పగల ఆ కూలీ వచ్చేవేపుకూ పాలోచనగా చూశాడు. కూలీ సామానుపెట్టి త్వరగానే వచ్చేశాడు మోహనరావు అన్నీ అడిగేశాడు. తన ఆ ఊరు వెళ్ళటానికిగల అవకాశం, తన భోజనం వగైరా అన్నీ అన్నిటికీ ఆకూలి సమాధానంలో చెప్పిన సారాంశం ఒక్కటే అక్కడ ఎక్కువ స్వంత బళ్ళే ఉపయోగిస్తారు కనుక ఒకటిరెండు మాత్రమే కిరాయిబళ్ళు ఊళ్ళోనించి ట్రైను టైముకి వస్తుంటయ్యి. కాని ఆరోజు పండగ అవటంమూలాన్నీ లవీరాలేదు అక్కడ చిన్నకిళ్ళీకొట్టు పెట్టుకునేవాడు, టీ వగైరా తయారుచేసేవాడూ ఊళ్ళోనించి ట్రైనుటయమునువచ్చి బేరం చూసుకొని పోతూఉంటారు. పంగడ అవటంమూలాన్నే వాళ్ళూ రాలేదు పండగ అవటంమూలాన్నే "చూశారా బాబూ బండిదిగినవాళ్ళు ఎవరూలేరు మీరుతప్ప" అన్నాడు. పండగఅవటంమూలాన్నే అక్కడికివచ్చే ఒకరిద్దరు కూలీలుగూడా రాలేదు.

వాడు ఇంకోవిషయంగూడా చెప్పాడు. అది వాడికీ పండగ అన్నవిషయం. నిజానికి వాడు కూలీ గాడు అక్కడ లైసెన్సుకూలీలు ఎవ్వరూలేరు లైసెన్సు తీసుకోనివాళ్ళుగూడా ఎవరూ రాలేదు. వాళ్ళకీ పండగ తనకి తప్పదుగనుక, తను రైల్వేలో చాకిరీ చేసుకుంటున్నాడు గనుక వచ్చాడు అక్కడ వాడు సిగ్నలరు.

పండగ, పండగ, అందరికీ పండగ; పండగైతే అన్నీ తల్లక్రిందులు అవ్వాలా. అతనికి బాగా ఆకలిగాఉంది. మసుకుఎండలో టైము తెలియటంలేదు. తన భోజనానికి ఏమైనా ఏర్పాటుచెయ్యగలడేమోనని అడిగాడు. పాపం వాడికి పెళ్ళాం బిడ్డలూలేరు. తోటి సిగ్నలరు ఇంట్లో వండించుకొని తింటున్నాడు. వాడు అన్నాడు. "తమరో పెద్దలు. తమరికి అభ్యంతరంలేకపోతే అక్కడ వండించి తెస్తాను"అని అతనికి ఆకలి దహించివేస్తున్నది కొంచెం బద్ధకంగా ఉండి ఉదయం టిఫెనుగూడా చెయ్యలేదు పర్సులోనుంచి రెండురూపాయలనోటు తీసి ఇస్తూ కాస్త త్వరగా పూర్తిచేయించి తీసుకురమ్మన్నాడు వాడు వెళ్ళాడు.

నిర్జనంగాఉన్న ఆ ప్రకృతిలో, జనంకోసం కట్టిన ఆ ప్లాట్‌ఫారం వైపుకి పైకీక్రిందికీ చూశాడు మోహనరావు ఏమీతోచక. బుకింగురూము కనిపించింది స్టేషను మాష్టరుగూడా రాలేదు అతనికీ పండగేగా అంత సహజమైన ప్రదేశాన్ని అసహజంగా, కరుకుగాచేసి దానిచుట్టూ, హద్దుమీరకుండా పెట్టినతీగా, మసకబారిన లాంతరుస్తంబాలూ, మాసిపోయిన స్టైనుబోర్డూ చెరిగిపోతామనే అక్షరాలూ, తోడులేనట్టు ఒంటరిగా దూరంగా ఏకాంతంగా ఉన్న సిగ్నలుస్తంభం యివన్నీ పండగలేనట్టు బోసిగా ఉన్నయ్. వాటిమధ్య నిలబడిఉన్న తనకీ పండగలేదు. తను వెళ్దామనుకున్న స్నేహితుడికీ పండగఉంది. పండగ ఉన్న వాళ్ళందరిలాగా పనీ తీరికాగూడా లేకుండా ఉంటాడు. స్కూలుకు శలవు గనుక పని ఉండదు. ఇంటిదగ్గర పని లేకపోవడం అంటూ ఉండదుగనుక తీరికఉండదు. ఈ మసుకు ఎండలో అతను కసురుతూ ఉంటాడు. మోహనరావుకి నవ్వువచ్చింది. తనకి పిల్లలంటే ఇష్టమూలేదు. సరదాగూడాలేదు. తన స్నేహితుడు రాజుకీ అంతే మొదటనించీ. తామిద్దరివీ చాలావాటిలో ఒకే అభిప్రాయాలు—ఒక్కవిషయంలోతప్ప. రాజుఅంటూ ఉంటాడు. "మోహన్ నువ్వు ఎప్పుడూ ఏదీ సరిగ్గా అర్థంచేసుకోవటానికి ప్రయత్నంచెయ్యవోయ్" అని. కాని తను ఒప్పుకోడు తనకి అర్థం చేసుకోటం సరిగ్గా ఎందుకుకాదూ. తను అన్నీ సరిగ్గానే అర్థంచేసుకుంటాడు. కాని ఇతరులు అర్థంచేసుకోరు. ఈ విషయంవల్లనే అతనిస్నేహితులు ఎప్పుడూ అతనితో స్నేహితంగా ఉండలేరు. ఉందామన్నా తను ఉండనీయడు. వాళ్ళని వదిలేస్తాడు. వదిలేశాడు. అట్లాంటివాళ్ళలో రాజు ఒకడు. తనురాజును వదిలేశినా అతను తనని ఒదిలిపెట్టలేదు. అతను వ్రాసిన చాలాఉత్తరాలుకూడా వ్రాస్తూనేఉన్నాడు కాని తనకి విశ్వాసం తను అన్నీ పూర్తిగా, సవ్యంగానే అర్థంచేసుకుంటాడు సవ్యంగానే చేస్తాడు.

చాలాసేపటివరకు తీగమీద పెట్టిఉన్నకాలు నొప్పివెక్కింది. అతను కాలుదించాడు మళ్ళీ పండగలేనివన్నీ తనచుట్టూ బోసిగా కనిపించినయ్యి. అతను అనుకున్నాడు. పండగలేనితను పండగఉన్నరాజు దగ్గరికి ఎందుకు వెళ్తున్నట్టు పండగఉండి, తీరికలేకపోవటానికీ, చేసేపనికీ మధ్యపడి ఊపిరాడకుండా ఉండే అతన్నిచూసి సంతోషించటానికా ? పండగలేకుండా, పండగ ఆఖరలేకుండా పండగలేకపోయినా ఫరవాలేకుండా ఉన్న తననిచూపెట్టి అతన్ని ఏడిపించటానికా. ఇవేవీకావు తను అన్నీ సమంగానే అర్థం చేసుకుంటాననీ, వాళ్ళే తప్పుగా అర్థంచేసుకుంటున్నారని చెప్తాడు ఇదేవిషయం ఎప్పుడో ఒకప్పుడు తనతో వైమనస్యంతో విడిపోయిన స్నేహితులకు, శాంతకిగూడా చెప్తాడు ఎప్పుడో ఒకప్పుడు అప్పుడు వాళ్ళే వస్తారు తనదగ్గరికి

ఆ మసక ఎండలో నిలబడటంతో, అసలే ఆకలిగా ఉండటంతో, అతనికి చాలానీరసంగా ఉంది ఆకలి వెయిటింగురూము రెండూ గుర్తువచ్చాయ్. సిగ్నలరు భోజనం తెస్తున్నాడేమోననిచూసి వాడెక్కడా కనబడకపోవటంతో మెమ్మదిగా వెయిటింగు రూమువేపు నడిచాడు. వెయిటింగురూము స్టేషనుకు కొంచెం లోపలగా ఉంది. అల్లాంటి చిన్నస్టేషన్లకి వెయిటింగురూములు ఉండవు. కాని స్టేషను పెట్టించుకోగల పలుకుబడికల ఆ ఆసామీ ఎవరో వెయిటింగురూము గూడా ఏర్పాటు చేయించుకున్నాడు. అతను రూములో ప్రవేశించాడు అది వెయిటింగురూములా లేదు. స్టేషనులో ఒకగది వెయిటింగురూములాగా ఉపయోగిస్తున్నారు. లోపల కొంచెం చీకటిగాఉంది బైట మసుకువల్ల గుమ్మానికి ప్రక్కగా ఒకచేతులున్న పడకకుర్చీ వేసివుంది. కొంచెం దూరంగా టేబులుఉంది. కుర్చీలేవీలేవు. ఇంకోమూలచూశాడు అతనికి ఆశ్చర్యంవేసింది. తనలాగే పండగలేనివాళ్ళెవరో ఇంకా అందులో ఉన్నారు వాళ్ళు ఆడవాళ్ళు. పట్టణ జీవితానికి అలవాటుబడ్డ అతను మామూలుగానే వెళ్ళి ఖాళీగాఉన్న ఆ పడకకుర్చీలో చేరబడ్డాడు.

అతనికళ్ళు వెలుతురు తక్కువగా ఉన్న ఆ ప్రదేశానికి త్వరగానే అలవాటుపడ్డయ్. మూలగా ఎవరో గోడవైపు తిరిగిఉన్నారు దానికికాస్త ప్రక్కగా మరో పెట్టెమీద ఒకఅమ్మాయి కూర్చునిఉంది అతని అడుగుల చప్పుడువిని తల ఎత్తి చూసింది. చూసినదగ్గర్నుంచీ తలదించుకోకుండా, చూపుమార్చకుండా

[illegible] ఆ అమ్మాయి నాగరికంగా కనబడాలని ప్రయత్నించే పల్లెటూరిపిల్లలా ఉంది

అతను నవ్వలేదు. కాని అటు చూస్తూనే ఉన్నాడు. చూస్తున్నది ఆ అమ్మాయినికాదు ఆ ప్రక్క పెట్టెమీద కూర్చుని ఆకలిగా, అకలితగ్గ ఆప్యాయతతో అన్నంతింటున్న కుర్రణ్ణి అతనికి కుర్రాడు తింటున్న అన్నం కమ్మదనం ముక్కులకి తగిలింది అతనికి ఆకలిగా ఉంది. అతే చూస్తున్నాడు ఆ అబ్బాయినికాదు అతనికి పిల్లలంటే ముచ్చటలేదు అతను చూస్తున్నది కుర్రాడివేపే తిరిగి ఏదేః ధ్యాస్నంతో ముద్ద అయిపోయినప్పుడల్లా ముద్ద చేతులో పెడుతున్న అబ్బాయి అమ్మని.

ఆమే అతన లోపలికివచ్చిన వెంటనే చాలా ఆశ్చర్యంకలిగించింది తను బూట్లుచప్పుడుచేస్తూ లోపలికివచ్చిన, వచ్చిన అగంతుకుడు ఎవరా అని తల తిప్పిచూసే ఉత్సుకతగూడ లేదు ఆ వ్యక్తికి. ఆ ఉత్సుకత ప్రతివాళ్లకి ఉంటుంది కాని ఆ వ్యక్తికిలేదు అతనికి నీరసంగాఉంది. ఆకలివేస్తున్నది అబ్బాయితినే అన్నంచూసి, అతనికి నోట్లో నీళ్ళు ఊరుతున్నాయ్ అతనికి ఆశ్చర్యంగానూ ఉంది అతనుచూస్తూనే ఉన్నాడు. అతనికి గలిగిన ఆశ్చర్యంలో కొంచెం అనుమానంగూడా ఉంది

అబ్బాయి అన్నం తినటం పూర్తి అయింది వాళ్ల అమ్మ ప్రక్కనే ఉన్న మరచెంబు చేత్తో తీసుకుంటూ, ఎంగిలిగిన్నెతో లేస్తూ అన్నది "పద నాన్నా చేయి కడుగుతాను" అంటూ లేచి వెనక్కి తిరిగింది అతను ఒక్క సారి ఉలిక్కిపడ్డాడు శాంత !! ఆమె గూడా చూసింది చూసి తల దించు కొని తడబడే అడుగులతో గబగబా బైటికి నడిచి వెళ్లింది అతడు విచ లితుడై చూసిన ఆ నిముషంలో, గంభీరమైన ఆమె ముఖంలో ఏ భావమూ పోల్చుకోలేక పోయాడు వెనగ్గా ఆ కుర్రాడు దూసుకుపోయినట్లు గబగబా నడిచి వెళ్లాడు.

ఆ కుర్రాడు తన కొడుకే ఆమెని మొట్టమొదట చూసిన వెంటనే పోల్చుకోలేక పోయాడు అతనికి ఆకలిగా, ఆకలివల్ల నీరసంగా, ఆ నీరసంలో భోజనం తెస్తానని వెళ్లినవాడు ఎంతసేపటికీ తిరిగి రానేలేదనే కోపంగా ఉంది. తను పరధ్యానంగా చూశాడు. ఆగంతుక వ్యక్తి ఎవరా అనే ఔత్సుక్యం కూడా కనబరచని ఆ వ్యక్తివైపు. తర్వాత అతను కుర్రాడు తినే అన్నంవేపు చూశాడు. సరిగ్గా చూస్తే పోల్చుకొనేవాడు.

లేదు ఆమె వెంటనే పోల్చుకోగలిగేట్లుగా లేదు కాని ఆ ముఖంలో అందం, గంభీరత మాత్రం తగ్గలేదు ఆ కుర్రాడు తన కొడుకు ఆమె శాంత ! శాంత తన .... అతని ఊహకి అంతరాయం వచ్చింది శాంత నాలు గేళ్ల క్రితందాకా తన భార్య, తర్వాత ? తర్వాత అతను ఆమెని పోషించడం లేదు భరిస్తే గదా భార్య అయ్యేది. విడాకులు ఇచ్చి ఆమెతో తెగతెంపులు చేసుకోనూ లేదు అందుచేత ఇప్పుడు ఆమె శాంత ! అంతే. అంతకంటె ఏమి చెప్పటమైనా అతని మనస్సులో ఉన్నదాని కంటె ఎక్కువో తక్కువో చెప్పటం అవుతుంది మామూలుగా అనుకునే వాడుకపదాల్లో అయితే అతను ఆమెను వదిలేశాడు. ఆమాట అంటే అతను కాదంటాడు. ఎదురుగా ఎవరూ అనరు ఎవరికీ అసలు సంగతి తెలియదు.

"ఇందుకా తను ఇంతదూరం వచ్చింది. ఏమిటీ యీ విచిత్ర సన్ని వేశం ? ఇది ఎక్కడికి దారితీసి ఎట్లా అంతమవుతుంది ఆమె తిరిగి లోపలికి వస్తే తను మాట్లాడుతాడా ఆమెతో ? మాట్లాడాలా ? ఒకవేళ ఆమె పలకరిస్తే సమాధానం చెప్పాలా ? అసలు యీ ఆవేశంతో స్థైర్యంగా ఉండగలడా ? లేకపోతే అక్కడనించి ఆమె వచ్చేలోపలే తను వెళ్లిపోవాలా ?" ఇన్ని ప్రశ్నలు అసలే ఆకలితో నీరసంగా ఉన్న అతనికి గుప్పెడు రాళ్లు ఒక్క సారిగానే విసిరినట్లు తగిలినయ్ ఏ ఒక్కదానికీ సమాధానం రాలేదు. వినబడ లేదు—ఉద్వేగంతో ఎక్కువగా కొట్టుకొనే గుండె చప్పుడు తప్ప.

ఎక్కువగా ఆలోచించే టైము గూడా లేదు తనకి. ఆమె కుర్రాడికి చెయ్యి కడిగి లోపలికి తీసుకొచ్చేంతలో ఏమి చెయ్యవలసిందీ నిర్ణయించాలి. అతను ప్రయత్నించాలని చూశాడు. నిర్ణయం రాలేదు సరిగదా గుండెల మీద బరువుగా పడిఉన్న చేతులు ప్రక్కకి తీసుకోటానికి కావలసిన ఓపిక గూడా రాలేదు. ఆమె తిరిగి లోపలికి వస్తున్నట్లుంది. కాళ్లకి చుట్టు కుంటూ అలల్లాగా తొణిగిపోయే చీర కుచ్చెళ్లలో నించి సున్నితమైన శబ్దం ఆ విషయం చెబుతూనే ఉంది. తను ఏదో ఒక నిర్ణయం చెయ్యాలి ఉద్వే గంతో గుండె ఇంకా ఎక్కువగా కొట్టుకుంటున్నది ఆమె లోపలికి వచ్చింది. కాదు వెళ్లింది తన యథాస్థానంలోకి. నిస్సహాయంగా అతని కళ్లు ఎప్పుడో మూతలు పడ్డయ్ కాని అతనికి అడుగుల చప్పుడువల్ల తెలిసింది.

దైన్యం పూసుకున్న కళ్లు ధైర్యంగా తెరుచుకున్నయ్. అతను ఓరగా చూశాడు ఆమె కూర్చున్న మూలకి ఆమె ఇంతకుముందు కూర్చున్నట్లే ముఖం గోడవైపుకు త్రిప్పి కూర్చుంది యథాస్థానంలో పెట్టెమీద పడు కున్న కుర్రాడి కాళ్లు ఆమె ఒళ్లో ఉన్నయ్.

ఇందాకటి అమ్మాయి అతని వైపూ, అతను శాంతని చూసినవైపూ ఇందాకటినుంచి చూస్తూనే ఉంది అతను శాంతవైపు బైటికి వెళ్లేటప్పుడు చూసినా, తిరిగి వచ్చేటప్పుడు చూడకపోవటంతో ఆ అమ్మాయి ముఖంలో కొంచెం తృప్తి కనిపిస్తున్నది అతను శాంతవైపు చూసి కళ్లు ప్రక్కకి త్రిప్పుతూ తనవైపు చూసినప్పుడు తృప్తిగా,మళ్లీ ఒక చిరునవ్వు నవ్వింది కూడా దానికి అతని ముఖంలో ఏమీ మార్పు రాలేదు అతను పరధ్యానంగా కళ్లు తలుపువైపుకి తిప్పి, అక్కడ ఉన్న తలుపుని గాని, లోపలికివచ్చే మసక వెలుగుని గాని చూడకుండా, మనస్సులో తప్ప ఎక్కడా ఉండని శూన్యం లోకి చూస్తున్నాడు.

శాంత ఇక్కడికి ఎందుకు వచ్చింది ? ఇక్కడ ఏం చేస్తున్నది ? అనే ప్రశ్నలు ఉద్భవించి అతని సమాధానం అఖరలేకుండానే ఉత్పతనం చెంది నయ్ అతనికి తెలిసినంతవరకూ అతని చుట్టాలు గాని, ఆమె చుట్టాలుగాని ఆ చుట్టుపట్ల ఎక్కడా లేరు ఆ తాలూకాలో లేరు ఆ ప్రాంతంలో ఎక్కడా లేరు మరి తను ఎందుకు వచ్చాడు తను వదిలివేసిన, తనని వదలివేయని స్నేహితుడు ఒకడు అక్కడికి ఐదుమైళ్లలో ఒక ఎలిమెంటరీ స్కూల్లో పని చేస్తున్నాడు అతన్ని చూద్దామని వచ్చాడు. ఆమె గూడా అట్లాగే వచ్చిం దేమో ఆమెగూడా స్నేహితుల కోసం వచ్చిందేమో ననుకునేటప్పటికి అతని మనస్సు కిలకబారింది బాధో, కోపమో తెలియంది ఏదో ఒక భావం హృదయంలో కలుక్కున పొడుచుకుంది మళ్లీ సమాధానపరుచు కున్నాడు. ఆమెకీ తనికీ ఇప్పుడేమీ సంబంధం లేదుగా ఆమె తన భార్య గాదుగా అనుకున్నాడు. ఆమెకీ స్నేహితులు ఉండవచ్చుగా. తన భార్య కాన ప్పుడు మరెవరి భార్య అయినా అయిఉండవచ్చుగా. కాని ఇవేవీ సంతృప్తిని కలిగించే సమాధానాలు కావు. అతని హృదయం ఏదో బాధ, ఆ బాధతో సలు పుతూ ఉన్నట్లుంది, ఆమాట తల్చుకున్నప్పుడల్లా—అతని [illegible] టంతో వ్యాకోచిస్తున్నది.

అతను ఆమెను గురించి మరొక ఊహ మనస్సులోకి తెచ్చుకోవ టానికి ప్రయత్నించాడు. ఆమెలో చాలా మార్పు వచ్చింది ఇంతకు ముందు కంటె చాలా అందంగా ఉంది. అప్పుడున్నట్లుగానే నిరాడంబరంగా ఉంది. అతనికి బైటికి మరొక్క మార్పు కనిపించింది. ఆమె అంతసేపు మౌనంగా కూర్చోటం. తనకు తెలిసినంతవరకు శాంత అంతసేపు మౌనంగా

ఉండలేదు. ఏదో ఒకటి మాట్లాడందే ఉండలేదు బైటకి కనిపించిన మార్పులు ఇవి లోపల మారిందో లేదో ? మార్పు వచ్చిందో లేదో అతనికి తెలియదు. ఆమెతో అతని పరిచయం రెండేళ్లే పరిచయం లేకపోవటం నాలుగేళ్లు. అందుచేత ఆమె మారిందో లేదో చెప్పటం కష్టం. కాని తనతో ఉన్న అనుభవాన్నిబట్టి చూస్తే మాత్రం అనిపిస్తుంది మారి ఉండదు అని. మారటానికి అవకాశం లేదు. శాంత చాలా పెడసరం మనిషి మారదు. చచ్చినా మారదు. మరి కొంచెం మార్పు కనిపించిందిగా ? దానికి సమాధానం అతని కేమీ దొరకలేదు.

అతను మళ్లీ ఆమెని గురించి మరో ఊహ తెచ్చుకోటానికి ప్రయత్నించారు ఆ రెండేళ్ల సాహచర్యంలో ఆమె తనకి యిచ్చింది తనకి ఆమె గుర్తు ఉండేట్లుగా ఇచ్చి వెళ్లింది మరేమీ లేదా అనుకున్నాడు చాలా ఉంది శారీరక సౌకర్యమూ, సౌఖ్యమూ, తృప్తి, ఆనందం గూడా ఇచ్చింది అతను చాలా ప్రసన్నుడైనాడు. ఈ వూహలో. మళ్లీ ఆమెవైపు ఒకసారి చూద్దామనుకున్నాడు .

"అతనికి మాటలు వినిపించాయి. "నా పెట్టె ఇంకొంచెం జరపమంటారా! మా బాబుని బెడ్డింగువేసి పడుకోబెట్టండి" అన్నది ఆ అమ్మాయి. శాంత సమాధానం చెప్పింది "అక్కర్లేదు" అని అతనికి అర్థమైంది, ఆ అమ్మాయి ఎందుకు మాట్లాడిందో తను అటు చూసేటప్పటికే మళ్లీ ఇందాకటి చిరునవ్వు నవ్వింది అతను మాట్లాడుతాడేమోనని ఆతృతగా చూసింది అతను తన తల మళ్లీ ప్రక్కకి తిప్పుకున్నాడు అతనికి శాంత సమాధానం గూడా వినిపించింది ఆమె మాటల్లో ఆ ధాటి, ఆ అధికారపూరకం తగ్గలేదు. అతను అనుకున్నాడు "ఇంత అందం, ఇంత చందం, ఇంత తెలివితేటలూ ఉన్న శాంతకి ఇంకొంచెం అణకువ ఉంటే బాగుండేది నేర్చుకున్నా బాగుండి ఉండేది" అతని మనస్సులోనించి ఇందాకటినించీ ఉన్న ప్రసన్న భావం ఇంకా పూర్తిగా పోలేదు. గులాబీపువ్వు, పువ్వు క్రిందగా ఉండే ముల్లు రెండూ ఇప్పుడు మళ్లీ స్పష్టంగా కనిపించాయి అతనికి ఇంతకుముందు ఎప్పుడూ ముల్లే గుచ్చుకునేది ఎప్పుడోగాని గులాబి తన అందంతో ముల్లుని మరచిపోయేలాగ చేసేదికాదు ముల్లు ప్రత్యేకంగా చెక్కివెయ్యలేక, అది గుచ్చుకున్నప్పటికీ బాధ, తర్వాత సలుపూ భరించలేక మొత్తం కొమ్మే ఛేదించి తృప్తి పొందాడు.

ఆవిషయం ఇంకా కొంచెం వివరంగా చెప్పటం అవసరం. ఆమె అతని స్థితిగతులకంటె బాగా మంచి స్థితిగతులున్న కుటుంబంలోనించి వచ్చింది. వచ్చేటప్పుడు వూరికే రాలేదు. ఆ తెగకి సంబంధించిన ఆడపిల్లలు తెచ్చేటట్లు గంపెడు సామానూ, తదనంతరం ఎప్పుడో వస్తుంది అనే ఆస్థికి సంబంధించిన సమాచారం గూడా వెంటబెట్టుకొని వచ్చింది. వీటికంటే గూడా మరొకటి ముఖ్యమైనదీ, అక్కడే వదిలేసి రావలసిన అవసరం ఉన్నదీ, వదిలెయ్యకుండా తీసుకొచ్చిందీ, వదిలెయ్యటానికి అవకాశం లేనిదీ మరొకటి తెచ్చింది అది ఆ స్థితిగతుల్లో పుట్టి పెరిగి వచ్చినవాళ్లకు ఉండేవిధంగా స్వతంత్రాభిప్రాయాలు, వాటిని వెలువరించటానికి అవసరమయ్యే నిస్సంకోచం. ఇవన్నీ అతనికి త్వరలోనే తెలిసినయ్యి ఆమె తెచ్చింది, తెచ్చినట్లు అతనికి తెలియంది తెలుసుకోటానికి అతను ఎప్పుడూ ప్రయత్నం చెయ్యనిదీ మరొకటి తెచ్చుకుంది. అది భర్త ఆజ్ఞకి లోబడి ఉండాలనే వివేకం, సర్దుకుపోయి పోయి గుట్టుగా కాపరం చేస్తేగాని గౌరవం ఉండదు అనే తెలివితేటలు

ఇన్నిటిలో అతని జీవిత ప్రాంగణంలో ప్రవేశించిన ఆమె ఉన్నన్నాళ్లూ అక్కడే ఉంది. అతని మనః ప్రాంగణంలోకి పోలేక, అక్కడ ఉండలేక సతమతమై అక్కడినించే నిష్క్రమించింది వచ్చినప్పటినించీ తన స్వంత అభిప్రాయాలు అలవాటు చొప్పున నిస్సంకోచంగా వ్యక్తం చేసింది. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ ఉంచాలి, ఏ గది దేనికోసం ఉపయోగించాలి అనే వాటి దగ్గర్నించీ. అతని అభిప్రాయాలతో అవి ఎప్పుడూ సరిపోయేవి కావు. కాని అతని ఆజ్ఞ ప్రకారమే, అతని ఇష్టప్రకారమే జరిపేది ఇక వచ్చిన ఇబ్బందల్లా అతని అభిప్రాయాలకి ముందుగానే తన అభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఒకవేళ అతను, అవకాశం ఇవ్వక అతని అభిప్రాయాలు ముందే వ్యక్తం చేస్తే తన అభిప్రాయాలు తర్వాతనైనా వ్యక్తం చేసేది.

ఇదే వాళ్లిద్దరి మధ్యా అన్యోన్యత లేకుండా పోవటానికి కారణం. ఇది కారణమని ఆమెకి ఎప్పుడూ గ్రహింపుకి రాలేదు. ఆమె అభిప్రాయాల్ని గురించిన మంచి చెడ్డలు అతను ఎప్పుడూ విచారించలేదు ఎవరి విశ్వాసాలు వాళ్లవి. ఎవరి నమ్మకాలు వాళ్లవి అవి అర్థం చేసుకొని మార్చుకోవటం అవసరం అనే విషయం వాళ్లు ఇద్దరికీ తట్టలేదు అది ఎవరి తప్పో ఎవరూ నిర్దిష్టంగా నిర్ణయం చెయ్యనూ లేరు

అతనికి తన విశ్వాసాలమీద గొప్ప నమ్మకం ఉంది. తన విశ్వాసాలు సరిగ్గా అర్థం చేసుకుని ఏర్పరచుకున్నవే అని అతని నమ్మకం ఈ విషయంలో అతనితో వ్యతిరేకించిన అతని స్నేహితుల్ని గూడా నిస్సంకోచంగా వదిలేశాడు. ప్రస్తుత విషయంలో అతని విశ్వాసం, ఆడదానికి ఆస్థి ఉండేవాళ్లమీద మగవాడికి సంపూర్ణాధికారం ఉండటానికి అవకాశం లేదు అనేది ఆ విషయంలో అతను విన్నవి, చదివినవీ అయిన కథల తప్ప మరే ప్రత్యక్ష ప్రమాణమూ లేదు ఆ అధికారం పూర్తిగా లేకపోతే మగవాడు ఆడదాన్ని వంచలేడు అని నమ్మకం ఇక పోతే ఇక్కడ ఇబ్బంది అల్లా ఆమె చేతికి ఇంతవరకు ఏమీ ఆస్థి రాలేదు ఆ ఆసి ఉన్న స్వతంత్రత ఆమె ఎప్పుడూ చూపనూ లేదు. కాని అతనికి మాత్రం ఆమె మాట్లాడే ప్రతి మాటలోనూ, వ్యక్తపరిచిన ప్రతి అభిప్రాయంలోనూ ఆ స్వతంత్రతే కనిపించేవి ప్రతి క్షణం అతనికి అదే అభిప్రాయం ఉండేది "ఇప్పుడే ఇట్లా ఉన్నది గదా, ఇంకా ముందు ఆ ఆస్థి కాస్త చేతులోకి వస్తే ఇక అప్పుడు పట్టపగ్గాలు ఉంటాయా" అనిపించేది

ప్రతి చిన్న విషయంలోనూ ఆమెచేత తన ఆజ్ఞని పాలింపచెయ్యటం అతనికి ఎంతో ఆనందమూ తృప్తి ఇచ్చినా, ఆమె చూసే ప్రతి చూపూ, ప్రతి మాటా తనని వెక్కిరిస్తున్నట్లుగా ఉండేవి. ఆమె అతని ఆజ్ఞ పాలించినప్పుడల్లా ఆమె చూపులోనూ, మాటల్లోనూ అతనికి ఒకే అర్థం వినబడేది "నువ్వు మొగుడివి నేను పెళ్లాన్ని నువ్వు వాజమ్మవైనా నువ్వు చెప్పింది నేను వినాలిగనుక, నిన్ను నేను ఖర్మంచాలక కట్టుకున్నాను గనుక, నీ గౌరవం దక్కించటానికి నేను సర్దుకుపోవాలి గనుక, నువ్వు చెప్పిందల్లా నేను వింటున్నాను" అన్నట్లు ఉండేది ఆమె ఏదో త్యాగంచేస్తున్నాను అని చెబుతున్నట్లు ఉండేది. అతను నిరంకుశాధికారం చెలాయించాడు. ఆమెతనను చిన్నచూపు చూస్తున్నట్లు ప్రపంచానికంతా అర్థమైందేమోనని ఉలిక్కిపడుతుండేవాడు

ముఖ్యంగా నలుగురు స్నేహితులు కలిసినప్పుడో, వాళ్ళకుటుంబాలతో కలుసుకున్నప్పుడో, లేకపోతే చుట్టాల ఇంటికి వెళ్లనప్పుడో చుట్టాలు వచ్చినప్పుడో అతని భయసందేహాల, ఆజ్ఞ ప్రమాణం ఎక్కువపొయ్యేది.

ఆడదాన్ని గురించి తెలుసుకోవటం, లేక వాళ్ళకి తెలియజెప్పటం అవసరం అనుకొని అసంఖ్యాకమైన, సంస్కారులు, అసంస్కారులు, ససంస్కారులు అయిన మొగుళ్ళలో అతనొకడు ఆ జాతికందరికీలాగే అతనికీ అవే తెలివితేటలు ఉన్నయ్ గనక వాటితోటే పరిష్కరించటానికి ప్రయత్నంచేశాడు. ఆమె దగ్గర ఆస్థిలేదుగనుక, ఇంకా రాలేదుగనుక అది తీసుకొని ఆమెని అణకువలో పెట్టే అవకాశంలేదు. అందుచేత తను సుఖపడాలంటే ఉన్నమార్గాలు రెండే తను లొంగిపోవటమో, లేక ఆమెని త్యజించటమో మగసిరిగల మొగుడు లొంగిపోడు గనుక, లొంగదీసే అవకాశంలేదు గనుక త్యజించేశాడు ఆమెని.

ఒకరోజు నిష్కర్షగా చెప్పాడు మనఇద్దరికీ కుదరదు వెళ్ళిపొమ్మని ఆమె వెళ్ళలేదు. అతను చెప్పిందేమీ, అలవాటులేదు గనుక, ఆమె వినిపించుకో లేదు ఆమె వెళ్ళలేదుగనుక వెళ్ళగొట్టాడు వెళ్ళిపోయేదాకా వెళ్ళగొట్టాడు. ఆమె తీసుకొచ్చినవేవీ ఇవ్వకుండా పంపేశాడు, ఆమె తీసుకురాంది ఏదో ఇచ్చి ఆమె కడుపులో అప్పుడే జీవించటం మొదలుపెట్టిన ఆ పసికాయ ఇవేవీ తెలియవు. వాడంటే వాళ్ళ నాన్నకేమీ జాలీ, ప్రేమా, అభిమానము లేవు,వాడూ వాళ్ళమ్మతో మౌనంగా వెళ్ళిపోయాడు.

చెబితే వినిపించుకోని మొగుడు దగ్గర్నించి, రచ్చకెక్కటం ఇష్టంలేని ఆత్మాభిమానంతోటీ, చెప్పకుండానే మొగుడికి ఎప్పుడో ఒకప్పుడు అర్థ మౌతుంది అప్పుడు మళ్ళీపునః ప్రవేశించవచ్చు అనే విశ్వాసంతోటీ, పుట్టు కతో వచ్చిన నిస్సహాయతతోటీ, చీకటిపోయిన తరువాత వెలుగురాక ఏమౌతుంది అనే నమ్మకంతోటీ, నలుగురికీ తెలిస్తే హైన్యం ఎక్కువ అనే, వివేకం తోటీ ఉప యోగంలేని ధైన్యంతోటీ, లోపలి అంకురంకాయుఐతే వాడివల్లనైనా సమన్వయం కుదురుతుంది అనే ఆశతోటీ అతని జీవితంలోంచి నిష్క్రమించింది. మరెవ్వరి జీవితంలోకీ ప్రవేశించలేదు మరెవ్వరికీ తనజీవితంలో ప్రవేశం యివ్వనూ లేదు ఆమెగురించి యీ కొంచెం చెబుతే చాలు

మోహనరావు ఇంకా ఆలోచిస్తున్నాడు, శాంతని, గురించి ఆమె తనకి ఇచ్చిన దేమైనా ఉందేమోనని వెతుక్కుంటూ. అతనికి ఒక్క విషయం గుర్తుకి వచ్చింది. తమ అభిప్రాయాలలో నిమిత్తంలేనప్పుడూ, ఆమె అందంలో తనను తాను మరచిపోయినప్పుడూ, ఆ మరచిపోయినప్పుడు ఆమె నవ్విన నవ్వులో తాను కరిగిపోయినప్పుడూ శాంతతో ఆ క్షణాలు స్వర్గం. కాని అలాంటి అవకా శాలు చాలాస్వల్పం. బాగాకాసే ఎండలో, చెమ్మలాగా అతనితాపంలో ఆ మధు రిమల అనుభవం ఎప్పుడూ త్వరగానే ఎండిపోయేది

అతని ఆలోచనలకు అంతరాయం కలిగింది

మరెవరో తమలాంటి పండగలేనివాడే సుడిగాలి దూసుకువచ్చినట్లు లోపలికి వచ్చాడు విసురుగా, పెద్దశబ్దంచేసే చెప్పులతోటే వస్తూనే చలవ జోడు తీసి చేతులో పట్టుకుంటూ, ఆశ్చర్యం ప్రకటిస్తూ అన్నాడు

“ఏమండీ బండి అందలేదా ? ఇక్కడే దిగబడిపోయారా”

మిగతా యిద్దరూగూడా అతనివేపు చూశారు. శాంత ముఖం కొంచెం ప్రక్కకితిప్పి నవ్వుతూ అన్నది

“అవునండి కొంచెంలో తప్పిపోయింది”

“అయితే చాలా అదృష్టమేనన్నమాట పండగపూట” అన్నాడు.

శాంత యీసారి నిస్సంకోచంగా నవ్వింది. అన్నది “ఎవరికీ, మీకా నాకా”

“మీ సంగతి నాకెలా తెలుస్తుంది నాసంగతే నేను చెప్తూ ఉంట” అన్నాడు

మోహనరావులో శాంత నవ్విన చిరునవ్వులో మళ్ళీ కొంచెం కలవరం బయలుదేరింది ఆ పల్లెటూరి అమ్మాయిగ్యాస్కొలాల్చిలో నించి, శాండో బనీను విడిచిపెట్టిన ఆ గంతుకుడి సౌష్టవాన్ని చూస్తున్నది మోహనరావుని వదిలిపెటే, మోహనరావుకి ఆ సంగతిగూడా అర్థమైంది.

శాంత తనకి అదృష్టమో, దురదృష్టమో చెప్పనూలేదు అతనికి ఏం అదృష్టమో ప్రశ్నించనూలేదు. కాని అడిగింది “నిన్నగూడా ఏమీ అన లేదే, ఇంతహఠాత్తుగా బయలుదేరారేం ఇంటికా”

ఈ మాట అంటున్నప్పుడు, అతని ఇంటిదగ్గర్నుంచి ఏమైనా దుస్సంఘ టనని గురించి వార్తవచ్చి వెళ్తున్నాడేమోననే అర్థం స్ఫురించేట్టుంది

అతనికదేమీ అర్థమైనట్టులేదు “బెజవాడ” అన్నాడు మామూలుగానే.

“ఏం ఎందుకూ ?” అన్నది తను మామూలుగా తీసుకునే చనువుతోటే

మోహనరావు ఆ చనువు చూసి కుర్చీలోనుంచి విసుగ్గా కదిలాడు

ఆగంతుకుడు ఆమెకి ప్రక్కనే పడేసిఉన్న బెడ్డింగును గోడకి దగ్గరగా లాగి కూర్చున్నాడు దానిమీద గోడకి చేరగిలపడుతూ శాంత అతన్ని కూర్చో మనా లేదు కూర్చుంటే ఏమీ అననూ లేదు మోహనరావు మాత్రం గుడ్లు మిటకరించి చూశాడు ఆగంతుకుడు అతనివైపు చూడలేదు ఇంకో అమ్మాయి ఎటు చూస్తున్నదో అనే విషయం మిగతావాళ్లు ఎవరికీ పట్టలేదు

ఆగంతుకుడు తాపీగా కూర్చుంటూ అన్నాడు “నిజం చెప్పమంటారా? లేక ఏదో ఒక కధ అల్లి చెప్పమంటారా”

“ఏది చెప్పాలని తోస్తే అదే చెప్పండి” అన్నది శాంత మొదట ఉన్న కుతూహలం కొంత తగ్గినట్టు

“సరే చెప్తాను ఏది చెప్పాలనుకున్నానో చెప్తానంటే చెప్తాను” అన్నాడు

“మీరు చెప్పే మాటలు ఏదీ అనుకోవటం కష్టమే అయినా ప్రయ త్నిస్తాను చెప్పండి” అన్నది ఏదో కొంత కాలం గడవటానికి అడిగినట్లుగా ఉంది

“మీరు గూడా వూళ్లో లేరా ? ప్రొద్దుటినుంచి ఏమీ తోచలేదు ఇవ్వాళ ప్రొద్దున్నే సత్యనారాయణగారు వచ్చి భోజనానికి పిలిచారు నాకు వెళ్లాలని లేదు అందుచేత వచ్చేశాను”

ఈమాటు శాంత ఆశ్చర్యం ప్రకటించింది “ఏం ఎందుకు ఇష్టం లేదు” వెంటనే గుర్తువచ్చి అడిగినట్లు అడిగింది

“ఇంతకీ భోజనం చేశారా ఎక్కడన్నా, లేకపోతే ఈ కారియర్లో ”

అతను ఆమె మాట పూర్తికాకుండానే అయిందన్నట్లు తల తిప్పుతూ అన్నాడు “నేను ఆ ఉచ్చులో పడదల్చుకోలేదు” అని తల దించి మళ్ళీ ఒకసారి పైకెత్తాడు

ఆమె ఇనుమడించే ఆశ్చర్యం ప్రకటిస్తూ అన్నది “ఏం ఉచ్చు”

“మీరేమీ తెలియనట్లు అడుగుతారు” అన్నాడు అట్లాంటి తెలిసి తెలియనట్లే వేసిన ప్రశ్నలకి సమాధానం లేనట్లుగా.

“అబ్బె నాకేమీ తెలియదు నిజంగా నాకేమీ తెలియదు” అంది

“అయితే ఏమీలేదు” అన్నాడు ఆ విషయం పూర్తి అయినట్లుగా

శాంతకి ఆ విషయం అంతటితో ఆగిపోవటం ఇష్టంలేనట్లు ఉంది. అన్నది “సరోజ మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తున్నది.”

దారిలోకి వస్తున్నావ్ అన్నట్లు చూస్తూ ఆగంతుకుడు అన్నాడు “ఏం అబద్ధంగా కూడా ప్రేమిస్తారా ?” అన్నాడు అమాయకుడిలాగా, అప్పుడే ప్రేమతో మొదటిసారి పడబోతోన్న నూతనుడిలాగా

“ఏం ఎందుకు ప్రేమించరు. అబద్ధపు ప్రేమగూడా ప్రేమిస్తారు అది ప్రేమ నటన అంటారు” అదే నిజమని మోసపోతూ ఉంటారు గూడా” అన్నది

అబద్ధపు ప్రేమని గురించి అతనికి అంతగా ఇష్టంలేనట్లుంది “పోనీ లెండి ఆ విషయం ఏది అబద్ధపు ప్రేమో, ఏది నిజమైన ప్రేమో తెలుసు కోవటానికి నాకు ఉత్సాహము లేదు అవసరమూ లేదు” అన్నాడు

“ఏం ఎందుకులేదూ మీ చుట్టూ జరిగే విషయాల్ని గురించి తెలుసు కోవటంలో ఉత్సాహం లేకపోతే మానె, అవసరమైనా లేదా” అన్నది తన అనుభవాల్ని ఏవో క్రోడీకరించి చెప్పున్నట్లు

మోహనరావులో ఇప్పుడు కొంత ఉత్సుకత వచ్చింది. ఆగంతుకుడిమీద కోపం అంతగా ఉన్నట్లు లేదు. ఆ అమ్మాయి వాళ్ళు మాట్లాడుకునే మాటల్లో అర్థం ఏమిటో తెలుసుకోవటం కంటె వాళ్ల చూపుల్లో అందరికీ తెలిసే అర్థాలు ఏమైనా ఉన్నాయేమోనని ప్రయత్నిస్తున్నది.

ఆగంతుకుడు అన్నాడు "అవసరమో కాదో నే నెప్పుడూ ఆలోచించ లేదు కాని అపాయంలోనో, ఉచ్చులోనో పడుతున్నా ననుకున్నప్పుడు మాత్రం ఆ ప్రమాదాన్ని గురించి తప్పుకొని దూరంగా పోవటానికి ప్రయత్నిస్తూ ఉంటాను"

"ఇప్పుడేం అంత అపాయం వచ్చింది. ఏ ఉచ్చులో పడుతున్నారు."

ఆగంతకుడు నిర్మొగమాటంగా మాట్లాడాడు. "అక్కడే నాకు కోపం వస్తుంది ఇప్పటిదాకా అన్నీ తెలిసినట్లు మాట్లాడారు. ఇక్కడికి వచ్చే టప్పటికి ఏమీ తెలియనట్లు మాట్లాడుతారు" అన్నాడు.

"సరోజిని మిమ్మల్ని ప్రేమించటం అపాయమా, ఉచ్చు పన్నటమా" ఈమాటు శాంత తన జాతి నంతటినీ వెనక వేసుకొచ్చింది.

"లేకపోవచ్చుగాని, నా యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా నన్ను శాశ్వతంగా బంధించాలని చూడటం ఉచ్చు పన్నటం కాదూ. జాగ్రత్తగా ఉండకపోతే అపాయంకాదూ."

అవునో కాదో ఆమె చెప్పలేదు. "భోజనానికి పోవడంవల్ల ఉచ్చులో పడిపోతారా. ఒంటరిగా ఉన్నారు. తెలిసినవారు పండగ గదా అని మీకు భోజనంపెట్టి తృప్తి ఇచ్చి సంతోషిద్దా మనుకుంటే దాన్ని ఎంతదూరం లాగారూ. నేను వూళ్లో ఉంటే నేను పిలిచేదాన్నే అనుకోండి ఇట్లాగే అనుకొని పారిపోయేవారా" అన్నది ఉద్రేకంగా.

వాదనకోసమే అన్నా యీ మాటలు వినడంతోటే మోహనరావుకి, ఆగంతుకుడు శాంతకు దగ్గరగా కూర్చొని ఉండటం గుర్తుకు వచ్చింది. భోజనం సంగతి వింటే ఆకలి గుర్తుకి రావలిసింది పోయి కోపమే వచ్చింది.

ఆగంతుకుడు శాంత మొఖంలోకి నిజంగానే అంటున్నదా అన్నట్లు చూశాడు.

ఉద్వేగంగా, సంతోషంతో అన్నాడు "ఊహు తప్పకుండా వస్తాను సంతోషంగా వస్తాను."

శాంత యీసారి బిగ్గరగా నవ్వింది అతను ఉలిక్కిపడ్డాడు మోహనరావు చాలా చిరాకు పడ్డాడు. శాంత ఏమిటీ యిల్లా మారింది అనుకున్నాడు. పరాయి మగాడికి ఇంత దగ్గరగా కూర్చొని అంత విచ్చలవిడిగా మాట్లాడుతున్నది అతనికి వెంటనే తట్టింది. ఇప్పుడు తను పరాయిమగాడు. తనకు శాంత దూరంగా కూర్చుంది ఆగంతుకుడి దగ్గరగా కూర్చుంది

అతను ఆకలి గుర్తు తెచ్చుకుని బైటికి పోదామనుకున్నాడు, వాడు భోజనం తెస్తున్నాడేమో చూద్దా మనుకుని కాని లేవ బుద్ధికాలేదు. శాంత ఇంకా ఎట్లా మారిందో తెలుసుకోవా లనిపించింది అయినా తన కెందుకూ శాంత తనకు ఏమీ కాదుగా ! ఈమాటే వచ్చిన దగ్గర్నించి అనుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. అతను లేవలేదు. వాళ్ల సంభాషణ సాగుతూనే ఉంది.

"ఏం నా విషయంలో ఏమీ అనుకోరా ? ఉచ్చు పన్నాననీ, అపాయమనీ" అంటున్నది శాంత.

అతను వెంటనే ఏమీ సమాధానం చెప్పలేదు సమాధానం కోసం వెతుకుతున్నట్లు ఉంది వెతికి ఆ సమాధానం ఆమెకు ఏదో రమ్యమైన పరిభాషలో చెప్పటానికి ప్రయత్నిస్తున్న ట్లుంది.

శాంత అతని సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లు కనబడలేదు సమాధానం చెప్పటం కోసం అతను చేసే ప్రయత్నం గమనించనూ లేదు

మోహనరావు అతని మనస్సులో ఉన్న మాటలు చదవటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె నవ్వి అన్నది "సరోజిని అందమైనది. మిమ్మల్ని ప్రేమిస్తున్నది. మిమ్మల్ని పెళ్లి చేసుకుంటే సంతోషిస్తుంది. మిమ్మల్ని సుఖపెట్టి తను సుఖ పడదా మనుకుంటున్నది"

అతను అన్నాడు "సరోజిని సంతోషించవచ్చుగాని, సరోజినిని పెళ్లి చేసుకొని నేను సంతోషించవద్దూ." ఈసారి ఆమె అనుకోనంత ఆశ్చర్యపడింది. మళ్లీ అన్నది.

"ఓహో అదా సంగతి సాధారణంగా ప్రేమికులు ఉభయుల మధ్య సమానమైన ప్రేమ ఉండటం కొంచెం అరుదు కాస్త ఒక భాగం ప్రేమ ఎక్కువ ఉన్నవాళ్లు రెండోవారికి ఆ సంగతి ముందుగా చెప్తారు. వాళ్ళు పెళ్లి చేసుకుంటే ప్రేమ ముందుగా బహిర్గతం చెయ్యనివారు, చేసినవారి కోసం కొంత త్యాగం చేసినట్లు కనిపిస్తారు. అందుచేత మొదటివారు రెండవ వారిని ఎప్పుడూ సంతోషపెడ్దామని ప్రయత్నం చెయ్యటం జరుగుతూ ఉంటుంది నీవు ప్రేమించినవారి కంటె నిన్ను ప్రేమించినవారిని పెళ్లి చేసుకుంటే సుఖపడ్తావు అన్నారుట ఎక్కడో ప్రేమసూత్రాలలో అది నిజమేకదూ. మీరు సరోజినిని పెళ్లి చేసుకుంటే ఆమెకోసం కొంత త్యాగం చేసినట్లు అనుకుంటారు ఆ విషయం సరోజిని తెలుసుకునేట్లు చేస్తారు. దానితో సరోజిని జీవితాంతం మిమ్మల్ని సంతోషపరచటానికి ప్రయత్నిస్తూ మీ విశ్వాసాన్ని పొందటానికే ప్రయత్నిస్తుంది దానివల్ల మీకు సుఖం కదూ" అని ఆపింది గుక్క త్రిప్పుకోవటం కోసం అన్నట్లుగా, ఇంకా చెప్పవలసింది ఉన్నట్లుగా.

కాని అతను చెప్పనివ్వలేదు. "జీవితంలో ఒక్క సుఖమే కాదుగా ఆనందమూ, తృప్తీ గూడా కావాలిగా ముఖ్యంగా ఇందాక మీరు చెప్పినట్లు నిన్ను ప్రేమించినవాడికంటె నువ్వు ప్రేమించినవానిని పెళ్లి చేసుకుంటే కొంచెం ఇబ్బందిపడ్డా తృప్తీ, ఆనందమూ పొందుతావు అని గూడా లేదూ ప్రేమ సూత్రాల్లో" అన్నాడు.

అప్పటికి ఆమెకి బోధపడింది పూర్తిగా. మోహనరావు అతను అన్న మాటల్లో అర్థంకోసం వెతికాడు. విపరీతార్థమే సులువుగా అర్థమైంది. అతనికి ఏదో సందేహం పొడసూపినట్లుంది. వెంటనే అసూయ కాలు పెట్టింది, అక్కడ.

శాంతకి ఆగంతుకుడి, సరోజినీ ప్రేమకలాపం గురించి కొంత తెలిసినా, ఇంత తెలియదు. ఆమెకు తెలిసిన వివరాలకూ, అతను చెబుదామని చూస్తున్నవాటికీ వ్యత్యాసం ఉంది. స్త్రీ సహజమైన కోర్కెతో, ఏది అసంపూర్తిగా భావాల్లోనే ఉందో దాన్ని పూర్తిగా విందామని కోరుకుంది.

"మరి మీరు సరోజిని ..... వెంటనే మాట మార్చి ప్రేమిస్తున్నా రనుకుంటున్నారంతా" అన్నది.

ఆమె ఏమి అనబోయి, అనలేదో అతనికి అర్థమైంది. అతడు అవమానం పొందినట్లు అనుకున్నాడు. ఇన్నాళ్లనించి అక్కడా అక్కడా ఏమిటనుకుంటున్నారో అతనికి తెలియకపోలేదు. కాని అతని ఎదుట ఎవరూ అనరు. ఏదో అనుకునే ఎవరెవరిమీదా, అందరిమీదా అతనికి అంతులేని కసిగా ఉంది. తన ఎదుట ఎవరన్నా అంటే అతని మనస్సులో ఉన్న కోపమంతా క్రక్కివేద్దామని ఉంది. ఇవ్వాళ శాంత అనకపోయినా, అన్నది. అతను ఏం

కక్కుదా మనుకున్నాడో ఏమిటో కాని క్రక్కినదాంట్లో మాత్రం మరొకటి ఏదో ఉంది.

అతను ఆవేశంగా అన్నాడు: "అయితే మీ విషయం ప్రకాశరావు విషయం గూడా అంతే అనుకోవాలా" అనేశాడు అనేసి తన మనస్సులో ఉన్న దంతా క్రక్కినంత తేలికపడ్డాడు. పైత్యరోగి అయితే కాని క్రక్కడు అలా క్రక్కితేగాని పైత్యం తిరగదు తిరిగితేకాని క్రక్కింది ఏమిటో తెలియదు.

అతని యీ ఆఘాతంతో ఉలిక్కిపడి ఎగిరిపడింది శాంత ఆమె గ్రుచ్చి మోహనరావువైపు చూసింది అతను చూస్తున్నాడో లేదో మాత్రం ఆమెకి అర్థంకాలేదు.

ఆ మాటలు అక్కడ ఉన్నవాళ్ళందరికీ వినబడ్డయ్ ఉద్రేకంతో మోహనరావు నరాలన్నీ ఒక్కసారి గుంజుకున్నయ్ అతని నెత్తురంతా కళ్ళ ల్లోకి వచ్చేసింది అప్రయత్నంగా వ్రేళ్ళే ముడుచుకున్నయ్ ఆ మాటలు వినీ వినటంతోటే వెన్నుపూసలోనించి ఏదో పైకి చరాచరా ప్రాకింది మోహనరావు కుర్చీలో పడుకున్నవాడల్లా లేవబోతున్నాడు

ఇంకో అమ్మాయికి ఇదేమీ పూర్తిగా అర్థమైనట్లు లేదు ఆమెక అర్థమైందల్లా ఆ మగవాళ్ళిద్దరూ గూడా తనవేపు అసలు చూడటంలేదు

ఆగంతుకుడి అఘాతంవల్ల పొందిన ఉద్రేకం ఎవరిలోనూ ఇంకా రూపం పూర్తిగా పొందకముందే మరొక రెవరో లోపలి కొచ్చారు. వస్తూనే ఇంకో అమ్మాయిని ఉద్దేశిస్తూ అన్నాడు "పదమ్మాయ్ పద బండి తోలు కొచ్చాను" అతను ఆపకుండా ఇంకా అన్నాడు "మొన్ననే వస్తావేమోనని మొన్ననే బండి తోలుకొచ్చా నువ్వు రాకపోవడంతో తిరిగి పోయా ఆ దొర పండక్కి రాకపోతే పోయాడు, నిన్నయినా అంపగూడదా అనుకున్నాం ఇవ్వాళ తిరపతయ్య వచ్చి నీ కబురు చెబితే అంతా ఆశ్చర్యపడ్డారు ఏం ఇంటిదగ్గర మాటామాటా అనుకొని రాలేదుకదా" అన్నాడు తాత

ఈ అమ్మాయికి సిగ్గంటూ ఉందా అనేట్లు వాళ్ళవైపు చూసిన ఆ అమ్మాయి సిగ్గంతా తన దగ్గరే ఉన్నట్లు సిగ్గుపడిపోయింది ఆ అమ్మాయి ఎవరివైపూ తిరిగి చూడలేదు ఎవరూ వాళ్ళ దోరణి పట్టించుకునేట్లు గూడా లేదు ఆ అమ్మాయి సమాధానంగా వెంటనే అంది "లేదు తాతా, లేదు ఆయనే వచ్చి బండి ఎక్కించారు పండగ సగం అక్కడా, సగం ఇక్కడా ఉండాలంట"

తాత అన్నాడు "ఏమిటోనమ్మా యీ పట్టుదలలు నలుగురూ ఏమైనా అనుకుంటారనేధ్యైనా లేదు పెద్దవాళ్ళ మాటలంటే అసలే ఖాతరులేదు సరేలే పద పోదాం కాస్త ప్రొద్దు ఉండగానే కొంప చేరుదాం"

తాత యధాలాభంగా ఆగంతకుడి ఎదురుగా ఉన్న మరచెంబువేపు చూసి, "బాబూ కాసిని మంచినీళ్లు ఉంటే పోస్తారూ" అన్నాడు

ఆగంతుకుడికి ఇందాకే పైత్యం తగ్గింగి తను క్రక్కుదామనుకున్న దేమిటో, క్రక్కిం దేమిటో బోధపడింది క్రక్కుదామనుకున్న బాధ కాకుండా అనుకోని నిర్దాక్షిణ్యాఘాతం వచ్చింది అతను అది ఉద్దేశించలేదు ఆ మర్మాఘాతం ఆమెకు ఎంత లోతుగా తగిలిందో అనే విషయాన్ని గురించి ఆలోచించలేక పోతున్నాడు అతను చేసిన అవమానం అర్థమైంది అప్రయత్నంగా మరచెంబు మూత తీసిచూసి, అందులో నీళ్లు లేకపోవడంతో నీళ్లు తీసు కొస్తానని గాలిలో గొణిగి, ఆమె యెదట ఉండి ముఖం చూపెట్టలేక బైటికి జారుకున్నాడు.

తన ఉద్రేకమంతనీ పొదివి పట్టుకుని, తన శాంతమీద చలాయించ టానికి అధికారం ఏమీ లేదని తెలిసి, ఆ ఆవేశం భరించలేక దాంట్లోనించి బైటికి దూకి తాత వచ్చినప్పటినించీ వాళ్ళవైపే ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నాడు మోహనరావు

అతనికి అర్థమైంది ఇంకో అమ్మాయికి గూడా బహిర్గతం చెయ్యలేని గుప్తవేదన ఉన్నది. అక్కడ ఉన్న ప్రతి ఒక్కరికీ అట్లాంటి వేదనే ఉన్నది. లేకపోతే వూరూ కాడూ కాని ఆ చోటికి ఎందుకు చేరుతారు జీవితం రెండో భాగంలో ఉన్న తాతకి గూడా పండగరోజు హాయిగా యింటిపట్టున ఉండ కుండా ఇంతదూరంపడి రావడం కష్టంగానే ఉంది ఆ విషయం గూడా అర్థమైంది

తాత మంచినీళ్లు లేకపోయినా ఫరవాలేదులే అన్నట్లు చూసి ఇంకా అమ్మాయివైపు తిరిగి "లే అమ్మాయ్ పెట్టె తీసుకెళ్లి లోపల పెట్టాను ఎద్దులు నించొని ఉన్నయ్" అన్నాడు అమ్మాయి లేవలేదు కూర్చొనే అంది "కాసేపు బండి ఇడుచుకోరాదు తాతా, కాసేపాగి పోదాం"

కాని మోహనరావుకి అర్థమైంది ఇంకో అమ్మాయికి అక్కడినించి వెళ్లటం ఇష్టం లేనట్లు జీవితంలో ఎవరి ఇబ్బంది వాళ్లది బొత్తిగా తృప్తీ, సుఖమూ లేనివాళ్ళు, ఏ రైలులోనో, కారులోనో ఆ తాత్కాలిక తృప్తి, ఆనందం పొందుతూ ఆ కారో, రైలో అట్లాగే పోతూ ఉండకూడదూ అనుకుంటున్నారు ఆ తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చే ఆ వ్యక్తి తనతోగూడా తన గమ్యస్థానం వరకూ రాకూడదూ అనుకుంటారు ఆ కారో, రైలో శాశ్వతంగా అక్కడే ఆగిపోగూడదూ లనుకుంటారు ఒక్కొక్కప్పుడు ఆ భావం వ్యక్తం అవుతుంటుంది గూడా. వాళ్లకు ఆ తాత్కాలిక ఆనందం పొందటానికి పడే తాపత్రయంలో బైటికి కనిపించే తెగువరితనం, ఎబ్బెట్టూ కూడా అర్థంకాదు.

ఎవరి తొందర వాళ్లది తాత అన్నాడు "సరేలే, సరేలే. ఎటూ కాకుండా యీ అడవిలోపడి ఉండటమెందుకూ యీ పండగపూట" అన్నాడు. ఎవరి చింత వాళ్లది దాంతో చుట్టుపట్ల పరిసరాలు, సభ్యతాసభ్యతలూ గూడా ఒక్కొక్కప్పుడు గమనించం అది పూర్వం అయితే ఎక్కువ గమనించే వాళ్లేమోగాని యీ రోజుల్లో అయితే నలుగురు చుట్టూ ఉన్నప్పుడు మాట్లాడే మాటల్లో ఉండవలసిన సభ్యతకూ అసభ్యతకూ ఉన్న గోడ చాలా పలచబడి పోయింది బాగా నాగరికత వృద్ధిపొందిన దేశాల్లో చుట్టూ ప్రపంచమే లేనట్లు, ఉన్నా సభ్యతకు ఏమీ లోపం లేనట్లు ముద్దులు గూడా పెట్టు కుంటారు మనం యిప్పుడే నాగరికత అభివృద్ధి చెందిస్తున్నాం గనుక, అది శిఖరస్థాయికి రాలేదు. రైళ్లలో, కార్లలో ప్రేమకలాపాలనీ, దాని విజయా లను గురించీ మాట్లాడుకుంటున్నాం అవసరమైతే ఒకర్ని ఒకరు ఆడా మగా భేదంలేకుండా అవమానించుకుంటున్నాం. అవి పూర్వం తప్పేమోగాని ఇప్పుడు తప్పో ఒప్పో విమర్శించటం అవసరం లేనంతగా మామూలు అయి పోయింది

ఇంకో అమ్మాయి పరిస్థితిలో దాదాపు అట్లాగే ఉంది. వెళ్ళేచోట వచ్చిన చోటుకు సంబంధించిన రకరకాల ప్రశ్నలు వేసి విసిగిస్తారు వచ్చిన చోటునుంచి చెప్పతగ్గ విశేషాలు ఏమీ లేవు తన్ను పంపించిన వ్యక్తి, తన ఎదుట ఉన్న వ్యక్తుల కంటె అందమైనవాడూ, నాగరీకుడూ కాదు వెళ్ళే చోట కనీసం యీపాటి క్షణికానందం అనుభవించటానికి గూడా లేదు అందుచేతనే యీ కొన్ని క్షణాలు ఆ తృప్తినీ, ఆనందాన్నీ అనుభవించటానికి ప్రయత్నం చేసింది కాని ప్రయోజనం లేదు

లేచి వెళ్ళేటప్పుడు అందమైన ఆగంతుకుడు అంతకుముందే వెళ్లి పోవడంతో, మోహనరావువైపే మళ్లీ చూసింది అతని దృష్టిని ఆకర్షించా లని శాంతవేపుగా తిరిగి చెప్పింది "వెళ్లివస్తానండీ" అని శాంత అదేమీ వినిపించుకున్నట్లులేదు ఆ అమ్మాయి వినిపించుకుంటాడు అని అనుకున్న మోహనరావు ఆ అమ్మాయివేపు చూశాడు ఆ అమ్మాయి గూడా సంతృప్తికి తిరిగిచూస్తూ పోయి తలుపు కొట్టుకొని తట్టుకొని అసంతృప్తిలోకి నిష్క్రమించింది.

తనకి ప్రస్తుతం ఏమీ సంబంధంలేని, పూర్తిగా లేకుండాపోని శాంత విషయమై హృదయంలో కుమ్ముతున్న వేదనతోటీ, జుగుప్స, ఆవేశాలతోటీ మోహనరావు సతమతమవుతున్నాడు. ఇందాకటినించీ తనకేమీ సంబంధం లేనట్లు ఆ భావాల భారంలోనించి నిర్లిప్తతలోకి దూకుతున్నాడు. కాని అక్కడ ఆట్టేసేపు ఉండలేకపోతున్నాడు. సంబంధం లేకపోవటానికి వీలులేదనేట్లుగా ముప్పిరిగొన్న ఆ భావాలు అతను ప్రయత్నంచేసి దూకిన నిర్లిప్తతలోనించి మళ్లీ లాక్కొని తమ మధ్య పడేసుకుంటున్నయ్.

ఏకాంతం వస్తున్నదంటే అతనికి ఏమిటో భయంగా ఉంది. ఆగంతుకుడైనా వచ్చేయకూడదూ అనుకున్నాడు. తను లేచి బైటికి వెళ్దామనుకున్నాడు. అతనికి ఇప్పుడు ఆకలి లేదు. ఆకలిగా ఉన్నదేమో తెలియడంలేదు. తెలిసేట్లుగా లేదు. నీరసంగా ఉంది. కుర్చీలోనించి లేవలేకపోతున్నాడు. శాంతవేపు మళ్లీ ఒకసారి చూశాడు. ఆగంతకుడితో మాట్లాడటానికి కొంచెం ప్రక్కగా తిరిగి కూర్చున్న శాంత ఇంకా అట్లాగే కూర్చొని ఉంది రాయిలాగా. ఇంతకు ముందు ఆగంతుకుడు కూర్చున్న ఆ బెడ్డింగుమీద ఇప్పుడు ఎవరో కూర్చొని ఉన్నారు. తనెప్పుడూ చూడనివాడు, తనకి రూపరహితుడూ అయిన ప్రకాశరావు అక్కడ బైఠాయించి ఉన్నాడు. శాంత అతనికి దగ్గరగా కూర్చుని ఉంది. మోహనరావు ఆవేశంతో, ఉద్రేకంతో ఉడికిపోతున్నాడు. అతనికి స్పష్టంగా కనిపిస్తున్న ప్రకాశరావు ఆమె కళ్లలో చదువుతున్నాడు. ఆమె చిరునవ్వుల్లో విరిగిపోయే భావాల్ని అతికిస్తున్నాడు. మోహనరావు చేతి వ్రేళ్లు మళ్లీ ముడుచుకున్నయ్. కుర్చీలోనించి లేచే ప్రయత్నం చేశాడు. ఛీ అనుకున్నాడు. అక్కడినించి, వాళ్ల దగ్గర్నించి దూరంగా వెళ్లటమో ప్రకాశరావుని చీల్చి నెత్తురు త్రాగటమో చేద్దామనుకున్నాడు. మళ్లీ నీరసంగా పడి ఉన్న శరీరాన్ని కదపటానికి ప్రయత్నం చేశాడు.

అతను ప్రయత్నంచేయ నక్కరలేకుండా పోయింది. మరెవరో లోపలికి వచ్చారు. తను వస్తానని చెప్పినట్లు భోజనంతో రాక పట్టి చేతుల్తోనే వచ్చాడు సిగ్నలరు. గుమ్మందగ్గర నించునే ఏదో చెప్పుపోతున్నాడు. మోహనరావు అతని ఖాళీ చేతులవైపు చూశాడు. అతను చెప్పేదేదో వినటానికి ప్రయత్నం చేశాడు. అతను చెప్పినదాంట్లో మోహనరావుకి అర్థమైందీ, విన్నదీ గూడా కొంచమే. వాడు రెండు రూపాయల నోటు తీసుకొని వెళ్తూ ఉండగా తనకోసమే స్టేషను మాష్టరుగారు ఎదురు వస్తున్నారట. వాళ్ల మనవడికి చిన్నబిడ్డ నొప్పి వచ్చిందట. పరిగెత్తుకుంటూ టౌన్లోకి వెళ్లవలసి వచ్చిందట. మందుకోసం. ఆ తొందరలో తన విషయం మాష్టరుగారికి చెప్పడం మరచిపోయాడట. బిడ్డ ప్రాణంమీదికి వచ్చిందికదూ అని రెండుసార్లు చెప్పాడు. మాష్టరుగారు తనని భోజనానికి తీసుకురమ్మన్నారట. వచ్చిన తర్వాత చెబితే ఇంటిదగ్గర చికాకుగా ఉన్నా ఆయనే బయలుదేరబోయాడుట. కాని తనే వద్దని, తను తీసుక వస్తానని చెప్పి వచ్చాడుట.

మోహనరావు అడగలేదు. శాంత అడిగింది, 'కుర్రాడికి ఇప్పుడు ఎట్లా ఉన్నది తాతా'' అని

''కాస్త ఫరవాలేదమ్మా. తేరుకున్నాడు. కఫం కరిగింది. నిద్రపోతున్నాడు'' అన్నాడు

వాడు రెండు రూపాయల నోటు కుర్చీ చేతిమీద పెడుతూ అన్నాడు ''పదండి బాబూ మీకోసం కాచుకొని ఉన్నారు. ఇప్పటికే చాలా ప్రొద్దు తిరిగింది ''

''నాకు ఆకల్లేదోయ్. నువ్వెళ్లి చెప్పు. వాళ్లు కాచుకొని ఉంటారేమో'' అన్నాడు

''అదేమిటి బాబూ అల్లాగంటారు. ప్రొద్దుటినించీ ఏమీ తినలేదన్నారు గూడా. బాగా డీలా పడిపోయాడు. పదండి బాబూ పోదాం'' అన్నాడు.

వాడు ఏదో మరచిపోయినట్లు చెప్పాడు అతనిని ఎల్లాగైనా తీసుకెళ్లాలని ''అబ్బే మీరేమీ మొహమాట పడక్లేదు బాబూ. వాళ్లంతా చాలా కలుపుగోలు మనుషులు ''

మోహనరావు శాంత కూర్చున్నవైపే చూశాడు మళ్లీ ఒకసారి. అజ్ఞాతుడూ, అపరిచితుడూ అయిన ప్రకాశరావు ఇంకా అక్కడే కూర్చుని ఉన్నాడు. మోహనరావు ఉద్రేకంతో కదలిపోయాడు. శాంత అతనివైపే చూస్తున్నదేమో తలకాయ దించుకున్నది అతని కళ్లు కలిసినప్పుడు

వాడు మళ్లీ అన్నాడు ''లేవండి బాబూ పోదాం ''

మోహనరావు కళ్లు జేవురించినయ్. ''నువ్వు వెళ్లవోయ్ నేను రాను'' అన్నాడు

''అదేమిటి బాబూ.. '' అని వాడింకేదో అనబోయాడు. చీల్చి వేసేటట్లు చూసిన చూపుతో అతని మాటలు బైటికి వచ్చే ప్రయత్నమే చెయ్యలేదు

వాడికి అర్థంకాలేదు. తనది పూర్తిగా కాని ఇంత చిన్న తప్పుకు ఆబాబు ఎందుకంత కోపగించుకుంటున్నారో. శాంతవేపు తిరిగి ''చూడండమ్మా '' అని ఏదో చెబుదామని మొదలుపెట్టాడు

శాంత అతనివేపు వెళ్లిపొమ్మన్నట్లు సంజ్ఞ చేసింది. అప్పటికే ఆమె చేతులు ఆమె ముందున్నటిఫిను క్యారియరు ఊడదీయటంమీద తొందరలో ఉన్నయ్. జబ్బుతో బాధపడే స్టేషను మాష్టరుగారు జాలిగా చూచిన చూపుతోటీ, తను పడిగా పరుగెత్తి మందు తీసుకురావటంవల్ల కలిగిన నీరసంతోటీ, బాబుకోసం చూసి కలిగిన బాధతోటీ, కలగాపులంగా ఉన్న సిగ్నలరు తనకి అర్థమైందన్నట్లు తృప్తిగా నవ్వి బైటకి వెళ్లాడు. వాడు చాలా దేశాలు తిరిగాడు. వాడికి చాలావాటి అర్థాలు తెలుసు



ఏజంట్లు సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ - సికిందరాబాగు - మధుర - బరహంపురం - బెంగుళూరు.

మోహనరావు ఎటువైపు చూస్తున్నట్లు లేడు. అపరిచితుడూ, అక్కడ శౌరితికంగా లేనివాడూ అయిన ప్రకాశరావుతో ఇంకా యుద్ధం చేస్తూనే యున్నాడు. ఆ ద్వంద యుద్ధంలో చీల్చి చెండాడుతున్నాడు. శాంత టిఫిన్ శారియరు గిన్నెలు చేత్తో పట్టుకొని చప్పుడు చేయకుండా ముందుకు వస్తూ అంది.

"పండగపూట కటికి పస్తు ఉండటం ఎందుకూ. వాచేతి భోజనంచేసే వాకాపాటి అదృష్టంగూడా కలగనివ్వకూడదనా ?"

అతను మాట్లాడలేదు. ఆమెవైపు చూడనూ లేదు.

ఆమె అతని కుర్చీకి ప్రక్కగా వచ్చి నిలుచున్నది అప్పటికీ అతను తల ప్రక్కకి తిప్పి చూడలేదు. ఒక గిన్నె కుర్చీ చేతిమీద పెడ్తూ అంది "నామీద కోపం ఉంటే ఉండనివ్వండి. భోజనంమీద కోపం ఎందుకూ" అంది.

అతను మాట్లాడలేదు. అటువైపు చూడలేదు

రెండోగిన్నెలోనించి మైసూరుపాకు ఒక కోపు పట్టుకుని ముందుకి వంగబోతూ అన్నది. "మీకు మైసూరుపాకంటే చాలా యిష్టం ఇదిగో చూడండి."

అతను ఇటువైపు తిరిగి చూశాడు మైసూర్పాకం వేపు అతని కళ్ళు క్రోథంతో ప్రజ్వరిల్లుతున్నయ్. ఆమె అదేమీ గమనించినట్లు లేదు

కటువుగా కఠోరంగా అన్నాడు "నా కక్కర్లేదు"

ఆమె నవ్వటానికి ప్రయత్నంచేస్తూ అంది. "నేను ఇచ్చినట్లుగా కాక పోతే తోడులేనిదీ, అపరిచితా ఐన తోటి ప్రయాణికురాలు ఇచ్చినట్లు తీసు కోండి" అన్నది. అందించే ప్రయత్నంచేస్తూ

వెనక్కి వాలిఉన్నవాడల్లా పడక కుర్చీలోనించి ముందుకు లేచాడు వూపిరి సలపనంత ఆవేశంతో అన్నాడు "తోడు లేకపోవటం ఏం. ప్రకాశ రావు ఉన్నాడుగా. నాకు ఏ పతిత చేతి తిండీ అక్కర్లేదు." అంటూ విసు రుగా కుర్చీమీద ఉన్న గిన్నెని చేత్తో తోస్తూ లేచి నించున్నాడు అక్కణ్ణించి వెళ్ళిపోయే ఉద్దేశ్యంతో.

ఆమె చేతిలో ఉన్న గిన్నె కూడా దభీమని జారింది. అప్పటికే పోయే ప్రయత్నంలో ఉన్న అతని భుజమూ చొక్కా అప్రయత్నంగా పట్టుకొని వెనక్కీ ముందుకీ ఊపేస్తున్నది ఆవేశంగా ఆమె నోటివెంట అప్రయత్నంగా మాటలు బైటికి వస్తున్నయ్ "ఏమన్నారూ ఏమన్నారూ!"అతనుఆమెముఖంలోకి చూశాడు. ఆమె భద్రకాళిలా ఉంది. అతని శరీరం ఊగిపోతూ ఉంది ఆమె శరీరం ఆవేశంతో వణికిపోతూ ఉంది. క్షణంలో భద్రకాళి పోయి క్షుభిత, అస్సహాయ, ఐన స్త్రీ దైన్యం ఆమె ముఖాన్ని ఆక్రమించింది ఆమె నోటి వెంట మాటలు వస్తూనే ఉన్నయ్ "మీరేనా, మీరేనా" అనేవి వణికిపోయే ఆమె చేతులు అతని శరీరంమీద నించి జారిపోతున్నయ్ జారే చేతుల వత్తిడి అతని శరీరాన్ని ఒక్క తోపు తోసింది. ఆమె కుప్పగా క్రింద కూలబడ్డది. అతని కాళ్ళు తడబడుతూ అతన్ని గుమ్మం అవతలికి లాగినయ్

ఆగంతుకుడిమీద పడి ఉండవలసిన పిడుగు విరుచుకొని మోహనరావు మీద పడింది. దీప్తమైన దాని కాంతితో అతని హృదయం స్తంభించి పోయింది అతనికి ఆఘాతం నెత్తిన పడిందో, ప్రక్కనించి దూసుక వెళ్ళిందో ఇంకా పూర్తిగా అర్థంకాలేదు.

మసకబారిన దీపస్తంభాన్ని ఆనుకొని నించున్నాడు. తను ఇచ్చిన రూపంతో, తన మనస్సులోనే స్థిరంగా తిష్టవేసిన ప్రకాశరావు మరొక్క బొమ్మ అక్కడ పడటంతో వెనక్కి ఒరిగిపోయాడు అవమానంతో దెబ్బ తిన్న ఆ భద్రకాళి, అసహాయమైన ఆ స్త్రీ దైన్యం అతని హృదయంలో హత్తుకుపోయినయ్యి అతనికి ఒక్కటి అర్థమైంది ఈ సారి అర్థ సూటిగా, సరిగ్గా నేఅర్థమైంది. "నీ సంగతి ఇదా అంటే, నీ సంగతి అదేలే" అని మాటకు మాట వడ్డించి తృప్తిచెందాడు ఆగంతుకుడు. తను అవమానం పొందాననుకు న్నప్పుడు. తన పవిత్రత చూపెట్టడానికి ఏమీ ప్రమాణం లేనట్లు, నీ విశ్వా సమే నా ప్రమాణం అన్నట్లు అసహాయంగా, దైన్యంగా చూసింది శాంత

కొడిగట్టి, సరియైన వెలుతురు ఇవ్వకుండా ఉన్న అతని జ్ఞానజ్యోతికి కట్టిన కొడి రాలింది. ఇప్పుడంతా సరిగ్గానే ఉంది. ఆ క్రొత్త వెలుగులో అతనికి అన్నీ సరియైన పద్ధతిలోనే అర్థమైనయ్. అప్పుడు తెలిసింది తను శాంతని ఎప్పుడూ అవమానమే చేశాడు ఇప్పుడు అంతకంటే వేల రెట్లు చేశాడు. ఏ స్త్రీ గూడా సహించలేనంత, సహించి క్షమించలేనంత అవ మానం చేశాడు. వెంటనే వెళ్ళి క్షమాపణ అడుగుదా మనుకున్నాడు. అతనికి ఇందాక ఆమె ముఖంలో అవమానం పొంది విజృంభించిన భద్రకాళి కనిపిం చింది శాంత క్షమించదు, అనుకున్నాడు అతను వెంటనే పరుగెత్తలేదు క్షమాపణ అడిగిచూడటానికి. ఆడవాళ్ళని హీనంగా చూడటానికి బాగా అయిన జీర్ణించుకునిపోయిన రాజసప్రకృతి లోపల్నించి ముందుకుతోస్తున్న భావాల్ని చుట్టేస్తున్నది

అతను యధాలాభంగా చూశాడు ఆగంతుకుడు చేతిలో మరచెంబుతో తిగను అనుకొని నిలుచొని ఎటువైపో చూస్తున్నాడు. మోహనరావుకి అర్థ మైంది. అతను ఎందుకు లోపలికి రాలేదో. తనలాగే అవమానించి వెళ్ళి క్షమించమని అడిగే ధైర్యంలేక అక్కడ తచ్చాడుతున్నాడు. మగవాళ్ళే అంత. జీవితాలలో వెంటనే సమాధానపడలేరు.

వాళ్ళిద్దరూ అక్కడ నిలబడి ఆమెని గురించే ఆలోచిస్తున్నారు ఇద్ద రికీ తాము చేసిన ఘనకార్యం విలువను గురించే, శాంతను గురించే ఆలో చిస్తున్నారు ఆ నిర్జన ప్రదేశంలో నిస్సహాయురాలు అబల ఐన ఒక భద్ర మహిళను క్షమించటానికి వీలులేనంతగా అవమానంచేసి, మళ్ళీ దగ్గరికి వెళ్ళే ధైర్యంలేని పురుషసింహాలు రెండూ ఎదురెదురుగా, గత్యంతరం లేకా, ఉపాయాంతరం తోచక అక్కడ నిలబడి ఉన్నయ్. వాళ్ళు చేసే అవ మానాలూ, చేసిన కట్టుబాట్లూ, వాళ్ళ నిరంకుశత్వం భరించటానికి పుట్టిన ఆ హైన్య స్త్రీజాతిలో ఒక అబల చావుకంటె భయంకరమైన అవమానంతో హృదయం వ్రక్కలై క్షోభించటం మాత్రం వాళ్ళు వినలేదు. వినరు. ఎవరూ వినరు ఊహించి తెలుసుకున్నా ఉపాయాంతరం వెతకరు వాళ్ళు రాజసులు స్వార్థులు. తామసులు. ఏమీ చెయ్యరు ఆక్రోభంతా భగవంతునిమీద విశ్వాసం ఉన్నవాళ్ళు మాత్రం వాడు వింటాడని, పూర్తిగా వింటాడని, అంటారు. వాడంటూవుంటే, వింటే, వాడుగూడా ఏమీ చెయ్యలేడు. తమ జాతికోసం వాడూ ఉపేక్షగా ఊరుకున్నాడు.

ఎవరితోటీ సంబంధం లేనట్లు కాలం మాత్రం ఎవరికీ తెలియకుండా తెలియచెప్పటానికి ప్రయత్నం చెయ్యకుండా చప్పుడు చేయకుండా ముందుకు నడుస్తుంటుంది. ఎవరైనా మేలుకొని ఉండి గమనించినా తనకేమీ ఫరవా లేదన్నట్లు గడుస్తుంది ఎవరి సంగతేదో వాళ్ళే చూసుకుంటారు. ఏ సంగతి చూసుకోవటానికి కావలసింది టైము కాదు. అసలు జీవితంతో సమాధాన పడటానికి అవసరమైంది అవకాశం. గుపు చప్పుడు లేకుండా గడచిపోయే కాలం మాత్రం కాదు.

జీవితంతో సమాధాన పడటానికీ దానికి కావలసిన అవకాశం కల్పిం టానికీ వాళ్ళ ధైర్యంతో నిమిత్తంలేకుండా వాళ్ళని లోపలికి పంపటానికి వాళ్ళకి మంచి స్నేహితుడే దొరికాడు. మసక మబ్బులోనించి రాలే చినుకులు కొంచెం జోరుగానే పడుతున్నయ్ ఆమె ముఖం ఎట్లా చూడటమా అనే ప్రశ్నతో ఇద్దరూ రూమువైపు నడిచారు. ఒకరి కంటె ఒకరు ముందు నడిచినా, ఒంటరిగా వెళ్ళే ధైర్యంలేక ముందు వెళ్ళినవారు రెండోవారు వచ్చే దాకా, గుమ్మం దగ్గర పడుతున్నకొద్దీ చిన్నగా నడిచి కలిసే లోపలికి ప్రవే శించారు. అయినా యిద్దరూ మాట్లాడుకోలేదు. మాట్లాడుకోవటానికి ప్రయత్నమూ చెయ్యలేదు.

ఆగంతుకుడే ముందుగా లోపలికి అడుగు పెట్టాడు మరచెంబుతో. ఆమె నిశ్చలంగా పూర్వం మాదిం గోడవైపు తిరిగి కూర్చొని ఉంది. ఎప్పుడో పెట్టెమీద పడుకుని నిద్రపోయిన కుర్రాడు ఇంకా లేవలేదు అతను ఏమీ మాట్లాడకుండా మరచెంబు క్రింద పెట్టాడు. వాళ్ళు రావటంలో ఔత్సుక్యము ఏమీ చూపెట్టని శాంతే, అవసరం లన్నట్లు పలకరించింది గరళం మింగిన శివునిలాగే ఏమీ జరగనట్లు పలకరించింది సబలులైనవాళ్ళకి అబలలైన తమకంటే, అబలలైన తమకి, సబలులైనవాళ్ళ అవసరం జీవితంలో ఎక్కువ. అందుకే తనే ముందు మాట్లాడించింది. "బైట వర్షం పడుతున్నట్లుందే" అని ఆగంతుకుడు ముందులాగా ధూకుడుగా మాట్లాడలేదు ఔనని సమాధానం చెప్పి బెడ్డింగు ఇంకాస్త దూరంగా లాక్కుని కూర్చున్నాడు దగ్గరగా కూర్చోలేదు. శాంత చూసిందో లేదో, ఏమీ మాట్లాడలేదు

మోహనరావు కూడా గదిలో ప్రవేశిస్తూ చూశాడు గదంతా కలయ చూశాడు. తను ఇంతకుముందు చూసిన దైన్యముఖం గాని, నేలమీద చిందర వందరగా పడిఉన్న ఖాద్య పదార్థాలుగానీ ఏమీ కనబడలేదు తను తన కుర్చీలో మామూలుగా కూర్చున్నాడు శాంత ముఖం చూడటానికి ప్రయత్నం చేశాడు అది కనబడలేదు శాంతకీ, ఆగంతుకుడికీ మధ్యన పూర్వం బెడ్డింగు ఉన్నచోట ఆ ఖాళీలో చాలాసార్లు కనబడ్డ ప్రకాశరావుకోసం ప్రయత్నం చేశాడు. కాని అత నక్కడ లేడు ఆగంతుకుడిమీదుగా కళ్ళు, ఇందాక ఇంకో అమ్మాయి కూర్చున్నచోట మీదికి వెళ్లినయ్. అతను ఏమీ ఆలోచించలేనంత అలిసిపోయాడు నీరసించిపోయాడు కాని ఆలోచిస్తూనే ఉన్నాడు. మనస్సు మనకి తెలిసేవిధంగానో, తెలియని విధంగానో ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటుంది అది ఒక ప్రవాహం ఎక్కడో కట్ట తెగి సముద్రమంతా ప్రవహించినట్లుగా ప్రవహిస్తూనే ఉంటుంది అందులో ఉప్పునీరు, మడ్డినీరు అంతా ప్రవహిస్తూనే ఉంటుంది

బయట వర్షం పడుతున్నదో లేదో తెలియటంలేదు తనకి ఆకలి అవుతున్నదో లేదో గూడా తెలియటంలేదు. ఇంకో అమ్మాయి ఖాళీచేసి వెళ్లిన ప్రదేశం చూసినప్పుడు మాత్రం అతనికి ఆ అమ్మాయి గుర్తు వచ్చింది ఆ అమ్మాయి లాలనగా, కోర్కెగా, సిగ్గులేనంతగా చూసిన చూపులు అన్నీ గుర్తు వచ్చినయ్. దానివల్ల అతనిలో ఏమీ మార్పు రాలేదు. నాలుగేళ్ల బ్రహ్మచర్యం తర్వాత గూడా ఆ చూపులు అతన్ని ఏమీ కదిలించలేదు

అతను శాంతవైపు చూశాడు. శాంతమీద తనకు ఎప్పుడూ ఆ విషయమై అనుమానం లేదు. అనుమానం కలుగలేదు ఆవిడ వ్యక్తిత్వంమీదనే, అతని అవిశ్వాసమంతా గూడు కట్టుకుంది. కాని ఆవిడ శీలంమీద యీ కొద్ది గంటలో గలిగిన సంఘర్షణవల్ల కలిగిన అనుభవంలో అతనికి ఆమె వ్యక్తిత్వం గురించి మళ్లీ ఆలోచన రాలేదు చిన్న చేపని పెద్ద చేపా, చిన్న మాయని పెద్ద మాయ మింగేస్తయ్ ఆమె వ్యక్తిత్వాన్ని కించపరచినప్పు డెప్పుడూ ఆమె అవమానం పొందలేదు అవమానం పొందినట్లు కనబడలేదు కాని ఇప్పుడు మాత్రం క్షమించటానికి అవకాశం ఇవ్వటానికి వీలులేనంత అవమానం పొందింది తను నిష్కృతి లేనంత అవమానం చేశాడు ఇంట్లోనించి నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టటం కంటే ఇన్నేళ్ళు వదిలెయ్యటం కంటె గూడా పెద్ద అవమానం చేశాడు. తను క్షమాపణ అడగాలి క్షమించినా, క్షమించకపోయినా సరే అడిగి తన తప్పు కడిగివేసుకోవాలి కాని ఆగంతుకుడు అడ్డుగా ఉన్నాడు. ఇందాకటినించీ ఏకాంతం అంటే భయపడ్డ మోహనరావు ఇప్పుడు ఏకాంతం కోరుకుంటున్నాడు

అక్కడ ఎవరూ మాట్లాడలేదు మాట్లాడే ప్రయత్నమూ చెయ్యలేదు ఎవరి ఆలోచనల్లో వాళ్లు ఉన్నారు బైట గంట వినిపించింది ఆగంతుకుడు లేచి అన్నాడు "టైం అయినట్లుంది. టిక్కెట్లు తీసుకొస్తాను" అని.

"నా టికెట్టు ఉదయమే కొన్నాను అదే పనికివస్తుందిగా. అక్కడ సిగ్నలరు ఉంటాడు అతనికి పెట్టె, బెడ్డింగూ బండిలో వేయాలని -కాస్త గుర్తు చెయ్యండి" అన్నది

ఆగంతుకుడు వెళ్లే తొందరలేని మోహనరావువైపు చూసి అన్నాడు "మీరు ఎక్కడికి వెళ్తారు" మోహనరావుకి అతను వెళ్లిపోతే చాలు అనిపించేట్లు ఉంది అతనితో మాట్లాడటానికి అతనికి ఉత్సాహమూ లేదు. యథాలాభంగా అన్నాడు "ఎక్కడికీ వెళ్లను" ఆగంతుకుడు ఆశ్చర్యంగా చూసి అక్కడినించి వెళ్లిపోయాడు రైలు వస్తుందేమోననే తొందరలో.

మోహనరావుకి అభిలషించిన ఏకాంతం వచ్చింది కాని అవసరమైన ధైర్యం రాలేదు. లేకపోయిందో అతని మనస్సు తొందరపడుతున్నది తను ఊరికి వెళ్లటం కోసం కాదు శాంత వెళ్లిపోతున్నది. శాంతది ఎప్పుడూ తప్పులేదు. తప్పంతా తనదే పండగపూట అవమానంచేసి పంపుతున్నాడు ఆమె సంగతి తెలిసిన అతనికి గట్టి నమ్మకమే తనని ఎప్పుడూ క్షమించదని. అందుచేతనేమో ధైర్యం చాలకుండా ఉంది కాని లోపల ఎవరో త్వరపెడుతున్నారు. కనీసం అడిగిచూడమని, అడిగి తృప్తిపడమని

అతను కుర్చీలో వెనక్కివాలి ఉన్నవాడల్లా ముందుకు వచ్చాడు ఆగంతకుడు, త్వరగా లోపలికి వచ్చాడు వస్తూనే అన్నారు "ఏమండోయ్ పటల్ఖడి బండి వచ్చేస్తుంది వ డెక్కడా కనబడలేదు స్టేషనుమాష్టరే సిగ్నల లాగుతున్నాడు మీరు లేవండి నేను యీ బెడ్డింగు ప్లాటుఫారంమీద పెట్టి వస్తాను అని వచ్చినంత ధూకుడుగానే బెడ్డింగ తీసుకుని బైటికి వెళ్లాడు.

మోహనరావుకి ప్రకాశరావు కనబడ్డాడు ఇప్పుడు స్పష్టంగా కనబడ్డాడు శాంత ప్రక్కనా కాదు, తన మనస్సులోనూ కాదు బెడ్డింగు లీసకొనిపోయే ఆగంతుకుడిలో అంతకు కొంచెం సేపటి క్రితమే కొడి రాలిన జ్ఞాన దీపపు కాంతి మరొక మూలకి ప్రసరించింది శాంత ఆడది మగాడు ఆడదాని అవసరం లేకుండా గడపగలడేమో కాని, ఆడదానికి మాత్రం మగాడి అవసరం ఎక్కువగా ఉంది

అతన్ని లోపల్నించి ఎవరో పొడుస్తున్నారు పిచ్చి ఆలోచనలు, జ్ఞానార్జనా మాని శాంతని క్షమాపణ అడగమని శాంతని నిలుపుకోమని నిలుపుకోవటానికి ప్రయత్నం చెయ్యమని అతని ఎండిపోయిన గొంతులో, నాలుక తడికోసం వెతుక్కుంటున్నది.

ఆగంతుకుడు మళ్లీ లోపలికి వచ్చాడు కాదు ప్రకాశరావు. ఎవరైతేనేం. ఎవరైనా ఒక్కటే అతను పెట్టె తీసుకున్నాడు మరచెంబు క్యారియరూ తీసుకున్నాడు ప్లాటుఫారం మీదికి వస్తున్నట్లు రైలు కూసింది 'రండి' అంటూ త్వరగా వెళ్లాడు

శాంత భుజంమీద వేసుకున్న నిద్రపోతున్న కుర్రాడితో, ఒక అడుగు వేసింది మోహనరావు లోపల "షీ మూర్ఖుడా" అని ఎవరో ఒక తన్ను తన్నారు అతను ఒక్క ఉదుటున లేస్తూ అన్నాడు, "శాంతా! నన్ను క్షమించు శాంతా!" ఆమె ఒక్క క్షణం ఆగి అతని ముఖంలోకి చూసి మళ్లీ బయలుదేరినట్లు అనిపించింది అతనికి అతను బావురుమన్నాడు. "నన్ను క్షమించవా శాంతా?" అని బైట రైలు కూస్తున్నది శాంత ఆగలేదు. గుమ్మంకేసి నడుస్తూనే ఉంది గుమ్మందగ్గరికి వెళ్లేటప్పటికే అతను అరిచాడు, కాదు ఆక్రందించాడు నీళ్లలో మునిగిపోయేవాడు నిస్సహాయంగా అరిచినట్లు అరిచాడు

"శాంతా వెళ్లిపోతున్నావా! నేను నీకేమీ కానా శాంతా."

ఆమెకి ఆ మాటలు వినబడ్డయ్యో లేదో కాని గుమ్మందాటి వడిగా వెళ్లిపోయింది మోహనరావు చాలాసేపటినించీ ప్రయత్నిస్తూనే ఉన్నాడు అంత ప్రయత్నించీ లేచి నిలబడ్డాడు గాని శాంత వెళ్లిపోకుండా అడ్డుపడ

లేకపోయాడు ఉద్వేగంతో ఒణికిపోయే కంఠంలోనించి బెరుకుగా వచ్చే మాటలు తనకు వినపడ్డాయి గాని, కాళ్లు మాత్రం ఎప్పుడో పాతి పెట్టగా ఊడలు గూడా దిగినట్లు స్థిరంగా అక్కడే ఉన్నయ్ హృదయం మాత్రమే శాంతతో పరుగెత్తింది

రైలుకూత మళ్లీ వినిపించింది శాంతని తీసుకురాలేక వట్టి హృదయమే దైన్యంగా తిరిగివచ్చింది ఇంత బలంగా పాతుకుని ఉన్న కాళ్లు ఏమీ సత్తువ లేనట్లు వంగిపోయినయ్ అతని శరీరమూ జారిపోయింది అతను కూలబడ్డాడు

శాంతను వెళ్లకుండా ఆపే లధికారం, ధైర్యమూ లేకపోయినయ్ అవి రెండూ ఎప్పుడో పోగొట్టుకున్నాడు శాంత వెళ్లిపోయింది లేదు తను వెళ్లగొట్టాడు కాదు మళ్లీ ద్వారం తెరిచి ఆహ్వానించాడు శాంత కుక్కకాదు కొడితే వెళ్లిపోయి తలుపు తెరిచిఉంటే మళ్లీ ప్రవేశించేందుకు శాంత మానుషంగల స్త్రీ శాంతకు జాలిలేదు అభిమానం లేదు తనకి ఉన్నయ్యా, ఉండే చేశాడు ఇదంతా! తనకి అప్పుడు తెలియదు తెలిశాక చెయ్యడు కాని చాలా ఆలస్యమైంది

మిగతాదంతా నిరాశా, నిర్వేదమూ, అంధకారం, వెలుగు ఉన్నా ఉపయోగం లేకపోవటం అనే విషయం గుర్తుచేస్తూ అతని జీవితంలోని ఆ కొద్ది గంటల్లో ఒక నాటకం ముగిసింది ఎవరో తీసుకొచ్చి వేసినట్లు ఆ విచిత్ర సమావేశం ఎవరో నిర్దేశించి పంపినట్లు సంఘటనలూ ఆ నాటకంలో చక్కగానే జరిగినయ్ ముగింపు కూడా జరిగింది

అతనికి అర్థమైంది శాంత శాశ్వతంగా లేకపోవటం శాంతి శాశ్వతంగా కోల్పోవటం—అని వెన్నెల కాయని చీకటిలా, తన కళ్లు రెండూ తనే పొడుచుకున్నవాడి అంధకారంలా ఉంది అతనికి ఆ క్షణంనించి అనుకొని ఏమీ ప్రయోజనంలేదు అనుకోకుండా ఉండనూ లేడు అనుకుని చేయగలిగిందీ లేదు అయినా అనుకుంటూనే ఉన్నాడు

అప్పుడే నిర్దేశించబడ్డ అతని శాశ్వత నిర్వేదంలో కాలం కొంత గడిచిపోయింది అట్లాగే గడుస్తుంది అట్లాగే గడిచిపోతుంది మానసిక బాధోద్వేగం కొంచెం తగ్గినప్పుడు శరీర బాధోద్వేగం తెలుస్తూ ఉంటుంది అతనికి ఇప్పుడు తెలుస్తున్నది నీరసం, ఆకలి, దప్పి అతనికి శాంత లేదు శాంతి లేదు ఆకలీ దప్పీ మాత్రం లేకపోవటానికి వీలులేదు ఏమీ లేనివాణ్ణి, జీవితంలో అన్నీ కొల్లగొట్టుకొనిపోబడి ఇంకేమీ మిగలని వాణ్ణి గూడా అవి వేదిస్తూనే ఉంటయ్ వాటి బాధనుండి తప్పుకోవటానికి అవకాశంలేదు అవి ఆశ్రయించుకొనిఉన్న శరీరం నాశనంచేస్తే తప్ప.

జీవితంలో వ్యక్తులు కొందరు చస్తారు కొందరు చావలేదు కాని వీటి వల్ల అంతా చస్తారు. మోహనరావు లేచాడు. అతనికి దప్పిక ఎక్కువగా ఉంది, ఆకలికంటే తిండీ నీరు కావాలి అతనికి ఇప్పుడు కావలసినవి ఎక్కడ దొరుకుతయ్యో తెలియదు శాంతను నిరాకరించినట్లే వీటినీ నిరాకరించాడు. శాంత క్షమించకుండా తిరిగి రాకుండా వెళ్లిపోయింది కాని ఇవి తిరిగి వస్తయ్ శాంతని తిప్పి తీసుకువచ్చేదేదీ లేదు తనదగ్గర. కాని వీటిని తిరిగి తీసుకురావటానికి అవసరమైనది ఉంది తన దగ్గర అవి నిరాకరించవు తిరిగి వస్తయ్ బ్రతుకు కూడా నిరాకరించే చావలేనివాణ్ణి

అతను బ్రతకటానికి, మొండి బ్రతుకు బ్రతకటానికి కావలసినవాటికోసం బైలుదేరాడు బైటికివెళ్లి గది గుమ్మానికి ఆనుకొని శూన్యంగా, నిర్జీవమైన ప్రకృతివైపుకీ దానిలోపలికి సమానాంతరంగా, ఎక్కడా కలవకుండా చొచ్చుకొని పోయే రైలు పట్టాలవేపుకీ చూశాడు

తనుగూడా దేనికీ కలవకుండా ఆ పట్టాలలాగే ఎక్కడా కలుస్తయ్యనే ఆశగూడా లేకుండా బ్రతకాలి అతని కన్ను మాసిపోయిన సైనుబోర్డువైపు చెరిగిపోయే అక్షరాలమీదా పడింది అవీ పండగలేకుండా, దూరంగా బోసిగా ఒకదానికి ఒకటి ఎదురుగా దగ్గర లేకుండా దగ్గరికి రాకుండా గడుపుతున్నయ్ తనూ అట్లాగే ఒంటరిగా ఆ బోర్డు చూసినట్లే ఎదురుగా చూస్తూ కలవని, దగ్గరికి రాని వాటివైపు చూస్తూ చెరిగిపోయి మాసిపోతాడు

అతను అప్రయత్నంగా రెండోవైపు తల తిప్పాడు దృష్టి అంత దూరం వెళ్లకముందే తల్లక్రిందుగా పడిఉన్న పెట్టె, బెడ్డింగూ కనిపించాయ్ వెర్రిగా పరుగెత్తాడు ఉద్వేగంగా అతని చూపులు అంతకుముందెప్పుడో చేరాయి, దూరంగా ప్లాటుఫారం తీగని ఆనుకొని పరధ్యానంగా ఉన్న ఆమె దగ్గరికి అతను పరుగెత్తాడు ప్రక్కగా పట్టాలమీద కూర్చుని ఆడుకుంటున్న కుర్రాడు కనిపించనేలేదు పరుగెత్తుతూ కేక వేశాడు శాంతా, అని, కేక పూర్తి అయ్యేలోపలే ఆమెని రెండు చేతుల్తోనూ హృదయానికి హత్తుకుంటున్నాడు ఎండిపోయిన అతని గొంతుకలోకి తడి వచ్చింది

అక్కడ ప్లాటుఫారమూ లేదు శూన్యమూ లేదు ప్రకృతీ లేదు. అక్కడ వేడి నిశ్వాసాలు ఉన్నయ్ అతని కళ్లలోనించి ముత్యాలు రాలుతున్నయ్ ఆమె ముఖంమీద శాంత తలఎత్తి అతని ముఖంలోకి చూస్తూ అంది, వేడి నిశ్వాసాల మధ్యనించి, ''ఏమండీ నిజంగా నామీద నమ్మకం లేదూ'' అని ఆ మాటలు బైటికి వస్తూవుంటే వాటితోబాటు మనస్సులో కలిగిన బాధ, కారి ఆమె చెక్కిళ్లమీదుగా జారుతున్నది

అతను ఏదో అనటానికి ప్రయత్నించాడు మాటలు పెగిలి రావటం లేదు తల మాత్రం ఊగుతున్నది ఇంకా బిగుసుకుంటున్న అతని చేతుల మధ్యలో ఒదిగిపోతున్న ఆమెకు అర్థమైనయ్, అతని నోట్లోనించి బైటికి రావటానికి ప్రయత్నిస్తున్న మాటలు.